ప్రజాశక్తి

గురువారం 1 జనవరి 2026

12 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఉత్సాహంగా ఆరంభం

- ★ సిఐటియు అఖిల భారత మహాసభతో కార్మికోత్తేజం
- ★ దేశ నలుమూలల నుంచి ప్రతినిధులు హాజరు
- ★ కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలకు పిలుపు
- ★ ఫిబ్రవరి 12 సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని విజ్ఞప్తి
- ★ వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణపై తీర్మానం

మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్ సేన్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ సాగర తీరంలోని ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం ఉదయం 9.30 గంటలకు సిఐటియు 18వ అఖిల భారత మహాసభ అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమైంది. తొలుత సంఘం అఖిల భారత అధ్యక్షులు కె.హేమలత సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎత్తరా ఎర్రెర్రని జెండా అంటూ ఎర్ర జెండా ఔన్నత్యాన్ని చాటి చెబుతూ ప్రజానాట్య మండలి కళాకారులు గీతాన్ని ఆలపించారు. అనంతరం ప్రతినిధులంతా అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి తరలి వచ్చిన ప్రతినిధులతో మహాసభ ప్రాంగణం సందడిగా మారింది. అనకాపల్లి జిల్లా కేడీ పేటలోని అల్లూరి సమాధి నుంచి బయలుదేరిన అల్లూరి సీతారామరాజు స్మారక జ్యోతి, శ్రీకాకుళం జిల్లా మందస నుంచి ప్రారంభమైన వీర గున్నమ్మ విప్లవ జ్యోతి, నెల్లూరు జిల్లా నుంచి కె.పెంచలయ్య విప్లవ జ్యోతి సభా ప్రాంగణానికి రాగా సిఐటియు అఖిల భారత నాయకులు వాటిని స్వీకరించారు.

మహనీయులను తలచుకుంటూ..

మహాసభ జరిగే హాలుకు బాలుదేవ ఆచార్య, లారెన్స్ వేదికగా నామకరణం చేయగా, ప్రాంగణానికి అనతలవట్టం అనందన్ నగర్‌గా పేరుపెట్టారు. ఇలా ఆ మహనీయులను ఈ మహాసభ స్మరించుకుంది. సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మహాసభ స్వాగతోపన్యాసం చేశారు. 'సేవ్ వైజాగ్ - సేవ్ స్టీల్‌ప్లాంట్' నినాదంతో ఆయన తన ప్రసంగాన్ని ఆరంభించారు. సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్‌ను, ప్రపంచ కార్మిక సంఘాల (డబ్ల్యూఎఫ్‌టియు) ప్రధాన కార్యదర్శి పాంబిస్ కిరిట్సిస్‌ను

మిగతా 2లో..

మహాసభకు హాజరైన ప్రతినిధులు

పోక్సో కేసుల నివారణకు సమన్వయం అవసరం

- జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో పోక్సో కేసులు తగ్గించాలంటే అన్ని శాఖలు మహిళా, శిశు సంక్షేమ శాఖతో సమన్వయంతో పనిచేయాలని, అప్పుడే ఆశించిన మేర ఫలితాలు సాధించగలమని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. పిల్లలపై లైంగిక నేరాల నుంచి రక్షణ చట్టం (పోక్సో చట్టం - 2012) అమలు, ఇతర అంశాలపై కలెక్టరేట్ మీటింగు హాలులో బుధవారం జరిగిన జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లలపై జరిగే లైంగిక నేరాలలో అధిక శాతం కుటుంబ సభ్యులు లేదా పరిచయస్తుల ద్వారానే జరుగుతున్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలపై నిరంతరం శ్రద్ధ వహించాలన్నారు. పోక్సో కేసుల త్వరిత పరిష్కారానికి పోలీసు, వైద్య శాఖల సమన్వయం కీలకమన్నారు. దర్యాప్తు ప్రక్రియ వేగవంతం చేయడంతో పాటు కచ్చితమైన, సమయానుకూల ఫోరెన్సిక్ నివేదికలను వైద్య శాఖ అందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. జిఓ 28 ప్రకారం పోక్సో బాధితులకు పరిహారం మంజూరు చేస్తున్నామని, బాధితులకు కౌన్సెలింగ్, వైద్య సేవలు అందిస్తున్నామని ఐసిడిఎస్ పిడి కెవి.రామలక్ష్మి ఈ సందర్భంగా వివరించారు. వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ బి.కీర్తి మాట్లాడుతూ విశాఖ జిల్లాలో అదనపు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. న్యాయవాది డి.అన్నయ్యబాబు, సైకాలజిస్ట్ డాక్టర్ నిత్య అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు, పోలీసు, వైద్య శాఖల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

అడ్డురోడ్డు జంక్షన్ రెవెన్యూ డివిజన్ కేంద్రం ప్రారంభం

▶ వార్త 12లో..

న్యూ ఇయర్ వేళ విశాఖలో డ్రగ్స్ కలకలం

▶ వార్త మెయిన్ 2లో..

వాల్తేరు రైల్వే డివిజన్‌లో రికార్డు స్థాయి వృద్ధి

▶ వార్త 2లో..

న్యూ ఇయర్ జోష్

అంబరాన్నంటిన కొత్త సంవత్సర సంబరాలు

హ్యాపీ న్యూఇయర్ అంటూ 2026 కొత్త సంవత్సరానికి యువతీ యువకులు ఉత్సాహంగా స్వాగతం పలికారు. విశాఖ నగరంలో నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని గ్రామాలు, పట్టణాల్లో కొత్త సంవత్సరం హడావిడి కనిపించింది. బుధవారం సాయంత్రం నుంచే యువత సందడి చేశారు. సినీ గీతాలకు డ్యాన్సులు చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. రంగులు పూసుకున్నారు. ఇళ్ల ముందు రంగవల్లులతో కొత్త అందాలు సంతరించుకున్నాయి.

మొదటి పేజీ తరువాయి..

ఉత్సాహంగా ఆరంభం

వేదికపైకి స్వాగతించారు. ఈ సందర్భంగా కిరిట్సిస్ అంతర్జాతీయ సంఘీభావాన్ని సభా వేదికపై వెల్లడించారు. ప్రపంచ కార్మిక సదస్సు 2026 మే19న కొలంబోలో జరుగుతుందని, కార్మిక వర్గం, రైతాంగం భారతదేశంలో సాగిస్తున్న ఐక్య ఉద్యమాలను అక్కడ ప్రస్తావించడం జరుగుతుందని అన్నారు. సిఐటియు పోరాటాల్లో ఎప్పుడూ ఒంటరిగా ఉండదని కొనియాడారు.

సభా వేదికపై ఐఎన్‌టియుసి అఖిల భారత కార్యదర్శి మంత్రి రాజశేఖర్, ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్, హెచ్‌ఎంఎస్ నాయకులు సుదర్శన్‌రావు, ఎఐసిసిటియు ఉపాధ్యక్షులు క్లిప్టన్ డి రోజారియో, ఎఐయుటియుసి అఖిలభారత కార్యదర్శివర్గ సభ్యుడు జయసేన్ మెహర్, యుటియుసి ఆఫీస్ బేరర్ షెకిజార్ అపసామి, ఎస్ఇడబ్ల్యూఎ ఉపాధ్యక్షురాలు సోనియా జార్జ్, సహా పలు కేంద్ర కార్మిక సంఘాల నాయకులు హాజరై మహాసభలో సౌహార్ద్ర సందేశాలిచ్చారు. సిఐటియు చేస్తున్న క్రమశిక్షణాయుత, సమరశీల పోరాటాలను పలు సంఘాల నేతలు కొనియాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు, కార్మికవర్గ హక్కులను ముందుకు తీసుకెళ్లేందుకు సిఐటియు మరింత కృషి చేస్తుందని వెల్లడించారు.

తీర్మానాలివీ..

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వైజాగ్ స్టీల్‌ప్లాంట్ (ఆర్ఐఎన్ఎల్)ను ప్రైవేటీకరించాలన్న నిర్ణయాన్ని సిఐటియు జాతీయ మహాసభ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు 'ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకించండి.. కార్మికులను, ప్రభుత్వ రంగాన్ని కాపాడండి' అంటూ తీర్మానాన్ని సిఐటియు అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ప్రవేశపెట్టారు. సభ దీన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. ఫిబ్రవరి 12 సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని మహాసభలో తీర్మానం చేశారు.

ఖాదర్ బాబా సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : సమాచార పౌర సంబంధాల శాఖలో పని చేసిన నాలుగో తరగతి ఉద్యోగి, కార్యాలయ సహాయకుడు ఖాదర్ బాబా సేవలు ప్రశంసనీయమని ఆ శాఖ సంయుక్త సంచాలకులు వి.మణిరామ్ అన్నారు. ఖాదర్ బాబా సమాచార పౌర సంబంధాల శాఖలో 39 సంవత్సరాల పాటు సేవలిందించి బుధవారం పదవీ విరమణ పొందిన సందర్భంగా స్థానిక సమాచార పౌర సంబంధాల కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. దుశ్శాలువాలు, పుష్పగుచ్ఛాలు అందజేసి ఆయన దంపతులను సత్కరించారు. జ్ఞాపికలు బహుకరించారు. జనవరి నెల నుంచే పింఛను అందుకునే విధంగా సిద్ధం చేసి తక్షణ మంజూరు పత్రాలను వీడ్కోలు సభలోనే ఆర్జెడీ వి.మణిరామ్, డిడి కె.సదారావులు ఖాదర్ బాబాకు అందజేశారు. కార్యక్రమంలో అనకాపల్లి డిఐపిఆర్వో ఎస్‌వి.రమణ, విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ ఎ.బాబ్జీ, సెట్విస్ సిఈవో రమ్య, సూపరింటెండెంట్ సుధాకర్, సమాచార శాఖ సూపరింటెండెంట్ జివికె ప్రసాద్, డివిజనల్ పీఆర్వోలు డి.నారాయణరావు, ఐ.శ్రీనివాసరావు, సహాయ సమాచార ఇంజనీర్లు రామకృష్ణ, సిహెచ్.బాలాజీ, ఎపిఆర్వో శ్రీనివాసరావు, ఎవిఎస్ కె.వెంకటరావు, పాల్గొన్నారు.

అగ్నిమాపక వాహనం, రోడ్ స్వీపింగ్ మెషిన్ ప్రారంభం

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్ట్ అథారిటీ, అగ్నిమాపక కేంద్రంలో నూతనంగా సమకూర్చుకున్న రోడ్ స్వీపింగ్ మెషిన్, మల్టీపర్పస్ ఫైర్ టెండర్‌ను బుధవారం పోర్ట్ డిప్యూటీ చైర్ పర్సన్ రోష్ని అపరాంజి కొరాటి ప్రారంభించారు. రూ.3.85 కోట్ల వ్యయంతో సమకూర్చుకున్న మల్టీపర్పస్ ఫైర్ టెండర్‌లో 6 కిలోలీటర్ల నీటి ట్యాంక్, 200 లీటర్ల ఫోమ్ కంపౌండ్, 100 కిలోల డ్రై కెమికల్ పౌడర్ (డీసీపీ), 45 కిలోల కార్బన్ డయాక్సైడ్‌తో పాటు అత్యవసర పరిస్థితుల కోసం అవసరమైన ఆధునిక పరికరాలు ఏర్పాటు చేశారు. రోడ్ స్వీపింగ్ మెషిన్‌ను పోర్ట్ పరిధిలోని అంతర్గత రహదారులపై ఏర్పడే దుమ్ము, చెత్త, స్పిల్లేజ్ తదితరాలను శుభ్రం చేయడానికి వినియోగించనున్నారు. రూ.4.69 కోట్ల వ్యయంతో ఈ యంత్రాన్ని కొనుగోలు చేశారు. అత్యాధునిక సాంకేతికతతో కూడిన ఈ యంత్రం గంటకు 20,000 క్యూబిక్ మీటర్ల సామర్థ్యంతో అన్ని దిశల్లో శుభ్రపరిచే సామర్థ్యం కలిగి ఉంది. కార్యక్రమంలో అరుణ్ ప్రసాద్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్, పోర్ట్ విభాగాధిపతులు సీనియర్ అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో జివిఎంసి

మాట్లాడుతున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ 2025 ఏడాదిలో సాధించిన విజయాలను మననం చేసుకుంటూ, 2026 నూతన సంవత్సరంలోకి సరికొత్త లక్ష్యాలతో అడుగు పెడుతోందని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. బుధవరం మధ్యాహ్నం జివిఎంసీ కార్యాలయంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌తో కలిసి ఆయన ఏడాది కాలపు ప్రగతి నివేదికను విడుదల చేశారు. పరిపాలనా సౌలభ్యం కోసం, ప్రజలకు సేవలను మరింత వేగంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జీవీఎంసీని 8 జోన్ల నుండి 10 జోన్లుగా పునర్వ్యవస్థీకరించినట్లు చెప్పారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.657.39 కోట్ల అంచనాలతో 1667 పనులు చేపట్టినట్లు తెలిపారు. ఏడీబీ నిధులు రూ.447.62 కోట్లతో చేపట్టిన 24X7 మంచినీటి సరఫరా ప్రాజెక్టు 75 శాతం పూర్తయిందని తెలిపారు. ఆక్రమణలకు గురైన 17 పార్కు స్థలాలను స్వాధీనం చేసుకుని, 330 ఆస్తులకు ఫెన్సింగ్ వేసినట్లు తెలిపారు. మహిళల రక్షణ కోసం గాజువాక, మధురవాడ ప్రాంతాల్లో రూ. 172 కోట్లతో వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. జాతీయ స్థాయిలో 'సఫాయిమిత్ర సురక్షిత్ షహర్' విభాగంలో విశాఖకు ప్రథమ స్థానం దక్కిందని చెప్పారు. పిఆర్ఎస్ఐ జాతీయ అవార్డులు, చైల్డ్ కేర్, సోషల్ మీడియా వినియోగం, మహిళా సాధికారత విభాగాల్లో మూడు జాతీయ అవార్డులను జీవీఎంసీ కైవసం చేసుకుందని వెల్లడించారు.

సింహాచలం ప్రసాదంలో నత్తపై ప్రశ్నిస్తే కేసులా?

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : సింహాచలం శ్రీవరాహ లక్ష్మీనరసింహస్వామి వారి పులిహోర ప్రసాదంలో నత్త రావడంపై ప్రశ్నించిన భక్తులపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయడం అత్యంత దారుణమని వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు కేకే రాజు అన్నారు. బుధవారం ఆయన వైసిపి జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రసాదం అపవిత్ర ఘటనపై ప్రశ్నించడమే తప్పు అయినట్లు భక్తులను తప్పుడు కేసులతో భయపెట్టడం, ఫిర్యాదు చేసినవారిపైనే కేసు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వ వైఫల్యాలతో రాష్ట్రంలో ఇప్పటికే అన్ని ప్రధాన వ్యవస్థలు నిర్వీర్యం కాగా, ఆలయాల నిర్వహణ కూడా అస్తవ్యస్తంగా మారిందని ఆరోపించారు. ఆలయాలను రాజకీయాలకు వేదిక చేయడంతో ఈ దుస్థితి దాపురించిందన్నారు.

బాధితులకు సహాయం అందిస్తున్న సిఐ దివాకర్ యాదవ్

బాధితులకు సిఐ చేయూత

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : కష్టం చెప్పుకోవడానికి వచ్చిన ఒక మహిళ బాధను చూసి మహారాణిపేట సిఐ జి.దివాకర్ యాదవ్ చలించి పోయి చేయూతనందించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... మహారాణిపేట దండుబజార్ ప్రాంతానికి చెందిన జైబూన్‌కు ఇద్దరు ఆడ పిల్లలు. తల్లితో కలిసి ఉంటున్నారు. బాషా అనే వ్యక్తితో 2007లో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. పెళ్ళైన దగ్గర నుండి భర్త ఆమెను అనేక బాధలకు గురిచేసి, ఇంట్లో నుండి పంపించేశాడు. దీంతో ఆమె కూలి పనులు చేస్తూ ఇద్దరు ఆడపిల్లలను ఇంటర్మీడియట్, తొమ్మిదో తరగతి చదివించింది. ఇంక కష్టాలు భరించలేక విశాఖ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీని కలిసి కష్టం చెప్పుకోగా, సిపి స్పందించి, బాధితులను మహారాణిపేట సిఐ దగ్గరకు పంపించారు. సిఐ దివాకర్ యాదవ్ వారి కష్టాన్ని చూసి, వెంటనే ఇద్దరు పిల్లలకు చదువుకోవడానికి పుస్తకాలు, ట్యూషన్‌కి ఫీజులు, జైబూన్ తల్లికి చీరలు కొనిచ్చారు ఇద్దరు పిల్లల చదువుకు కావాల్సిన ఖర్చులు తాను చూసుకుంటానని సిఐ భరోసా ఇచ్చారు. అంతేకాకుండా జైబూన్ భర్త చేసిన అన్యాయానికి ఆయన్ను పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తామని హామీచ్చారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE
AT : VISAKHAPATNAM
G.O.P.22/2025

Between:
1) Smt. Marpu Yasodha,
2) Smt. Marpu Vijaya Lakshmi
...Petitioners
And
Nil ...Respondent

GENERAL NOTICE

The general public are hereby informed that my client Smt. Marpu Yasodha and Smt. Marpu Vijaya Lakshmi, R/at D.No.1-20/3/1, Radha Krishna Nilayam, Prasanthi Nagar, Chinnamushidiwada, Pendurthi, Visakhapatnam -531173, that they have filed G.O.P. 22/2025 at Principal District Judge at Visakhapatnam to appoint the 1st Petitioner as guardian of the person and property of the minors Marpu Yogindra and Marpu Ganeshwari and also grant permission to sell the below schedule property anybody objections to sell the property please raised your, objections on **19-01-2026** at Principal District Judge Court at Visakhapatnam in G.O.P. 22/2025 at **10:30 A.M.** personally or through your Advocate.

SCHEDULE :

Land an extent of 284.28 Sq. Yds of VUDA approved Layout vide RC LRS/ 3505/10/LI, Survey No. 47/7B, R.C.C. slabbed house at Chinnamushidiwada, Pendurthi, Visakhapatnam and bounded as follows: **East:** Road, **South:** Property belongs to Kella Srinivasa Rao, **West:** property belongs to Yellapu Jaggayyamma, **North:** Property belongs to Mummana Peda Suryanarayana.

(By Order of the Hon'ble Court)
KAMSU PRABHAKAR,
Advocate, Visakhapatnam-27,
Cell: 9848338408.

వాల్తేరు రైల్వే డివిజన్‌లో రికార్డు స్థాయి వృద్ధి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : భారతీయ రైల్వేలో కీలకమైన వాల్తేరు డివిజన్ 2025వ సంవత్సరంలో మౌలిక సదుపాయాల కల్పన, ఆదాయం, ప్రయాణికుల సౌకర్యాలు భద్రత వంటి అన్ని రంగాల్లో అసాధారణ వృద్ధిని కనబర్చినట్లు డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన 2025 ఏడాది పనితీరును సమీక్షిస్తూ ఈ మైలురాళ్లను వెల్లడించారు. వాల్తేరు డివిజన్ ఈ ఏడాది భారతీయ రైల్వేలో 5వ అత్యధిక ఆదాయం ఆర్జించిన డివిజన్‌గా, 5వ అత్యధిక లోడింగ్ సాధించిన డివిజన్‌గా నిలిచింది. నవంబర్ నాటికే రూ.9,030 కోట్ల ఆదాయాన్ని 73.5 మిలియన్ టన్నుల లోడింగ్‌ను సాధించడం విశేషం. కేవలం 256 రోజుల్లోనే 100 మిలియన్ టన్నుల లోడింగ్ మార్కును దాటి డివిజన్ చరిత్రలో కొత్త రికార్డు నెలకొల్పింది. ప్రయాణికుల ప్రయాణాన్ని మరింత సుఖమయం చేసేందుకు వాల్తేరు డివిజన్ అనేక చర్యలు తీసుకుందని తెలిపారు. రౌండ్ ట్రిప్ ప్యాకేజీ స్కీమ్ ద్వారా ప్రయాణికులకు 20శాతం రాయితీ కల్పించారు. రాయగడను భారతీయ రైల్వేలో 70వ డివిజన్‌గా ఏర్పాటు చేయడం ఈ ఏడాది అతిపెద్ద మైలురాయి. దీనితో పాటు సుమారు రూ.1,200 కోట్ల వ్యయంతో నాలుగో లైన్లు, ఫ్లైఓవర్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, స్టేషన్ల ఆధునీకరణ పనులు చేపట్టారు. 'అమృత్ భారత్ స్టేషన్' పథకం కింద 15 స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నారు.

టిడిపి ఉత్తమ కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో కార్యకర్తల కృషిని గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో సేవకు గుర్తింపుగా ప్రశంసా పత్రాలు అందజేసే కార్యక్రమం బుధవారం టిడిపి దక్షిణ నియోజకవర్గం కార్యాలయంలో నిర్వహించారు. ఇందులో భాగంగా 33వ వార్డు క్లస్టర్ ఇన్చార్జ్ విల్లూరి తిరుమలదేవి చక్రవర్తికి ప్రశంసా పత్రాలను టిడిపి దక్షిణ ఇన్చార్జ్ సీతంరాజు సుధాకర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్లమెంట్ మాజీ ఉపాధ్యక్షులు విల్లూరి డాక్టర్ చక్రవర్తి పాల్గొన్నారు.

ప్రశంసా పత్రం అందజేస్తున్న సుధాకర్

టోయింగ్ వాహనం ప్రారంభం

ప్రజాశక్తి, ఎంవిపి కాలనీ : గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో సమకూరిన అత్యాధునిక టోయింగ్ వాహనాన్ని బుధవారం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ ప్రస్తుతం నగరంలో ఒకటే స్పీడ్ లేజర్ గన్ అందుబాటులో ఉందని, ప్రమాదాల నివారణకు మరిన్ని పరికరాలు అవసరమని పేర్కొన్నారు. దీనిపై జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తక్షణమే స్పందిస్తూ, త్వరలోనే మరో 3 స్పీడ్ లేజర్ గన్‌లను అందజేస్తామని హామీ ఇచ్చారు.

'హామీలను అమలు చేసిన కూటమి ప్రభుత్వం'

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం 18 మాసాల వ్యవధిలోనే అమలు చేసిందని టిడిపి విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు చోడే వెంకట పట్టాభి రామ్ అన్నారు. బుధవారం జిల్లా టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ 6 అమలు చేస్తున్నట్లు చెప్పారు. నాయకులు బైరెడ్డి పోతన్నరెడ్డి, అక్కరమాని వెంకట్రావు, వెంకటరమణ పాల్గొన్నారు.

NOTICE U/O 21 RULE 66 OF CPC
IN THE HON'BLE COURT OF THE XIII ADDL. DISTRICT JUDGE
AT : GAJUWAKA
E.P. 108/2019 in A.C.429/2017

Between:
M/s. Shriram Finance Limited
(Formerly known as M/s. Shriram City Union Finance Limited, **I-Town Branch,** Visakhapatnam
...D.Hr/Petitioner
And
Rakesh Kumar Singh & others
...J.Drs/Respondents

To,
J.Dr-2: Smt. Renu Devi,
W/o. Rakesh Kumar Singh,
R/at D.No.65-1-83/1, Srinivasa Nagar, Sriharipuram, Malkapuram, Visakhapatnam.

Please take notice that the above-named D.Hr/petitioner filed the above E.P. notice of the day fixed for setting a sale proclamation under Order 21 Rule 66 of C.P.C and the matter stands posted to **09-01-2026** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **09-01-2026** at **10:30 A:M** in the above Hon'ble Court, failing which the matter will heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
KODURI SREENIVASA RAO
Advocate,Visakhapatnam.

జనరల్ నోటీసు

నా క్లయింటు అయినటువంటి బొండా రమణమ్మ, భర్త రావోజీ, రామనగర్, యలమంచిలి, అనకా పల్లి జిల్లా, నాకు ఇచ్చిన భోగట్టా పై నేను ఇచ్చుచున్న జనరల్ నోటీసు అంశములు..

సదరు ఈ క్రింది నోటీసు షెడ్యూలు ఆస్థికి యజమానులైన 1. ఇప్పిలి స్వాతి, భర్త కుమార్, పెదగంట్యా డ, గాజువాక మండలం, విశాఖపట్నం, 2.సింహాద్రి స్వర్ణగౌరి, భర్త ప్రసాదరావు, హులుయూర్ పోస్టు, టుముకుడు జిల్లా, కర్నాటక రాష్ట్రం, జన 2రు సదరు ఆస్థిని తేది.12.07.2025ని నా క్లయింటుకు అమ్మజూపగా అందుకు నాళ్లయింటు అందరికంటే హెచ్చురేటు అనగా సెంటు ఒక్కింటికి రూ.8,40, 000లు చొప్పున మొత్తం యం.0.17ట్లుకు రూ.39,25,000లు ఆఫరుచేయగా అందుకు సదరు పై ఆసా ములు అంగీకరించి నా క్లయింటు వద్దనుండి అడ్వాన్సుగా రూ.5,00,000లు తీసుకుని అంతటినుం డి 90రోజులలోగా మిగిలిన సొమ్ము తీసుకుని నాక్లయింటుపేరున క్రయదస్తావేజు రిజిష్టరు చేయించి. ఇస్తామని అంగీకరించి నా క్లయింటు పేరిట అదేరోజున పురోణీ అగ్రిమెంటు వ్రాసియున్నారు. దరిమిలా క్లయింటు మిగిలిన సొమ్ము సిద్ధంచేపుకుని వారిని ఎన్నిసార్లు రిజిష్టరు చేయమని అడిగినా వారు ఇది గో, అదిగో అని వాయిదావేస్తూ వస్తున్నారు. ఆ మధ్యన సదరు ఆసాములు నాక్లయింటు పేరున అగ్రిమె ంటు ఉండగానే సదరు ఆస్థిని వేరొకరికి అమ్మజూపుటకు తప్పుడుగా ప్రయత్నాలు చేస్తున్నారని నా క్లయింటుకు తెలియవచ్చినది. కావున ఈ నోటీసు పూర్వకంగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా ఈ నోటీసు షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరైనా పై ఆసాముల వద్ద అమ్మకాలు, కొనుగోళ్లు వగైరాలు చేసినెడల వారు నా క్లయిం టు తీసుకును లీగల్ చర్యలకు పూర్తి బాధ్యత వహించవలసియుండును.

నోటీసు షెడ్యూలు

అనకాపల్లిజిల్లా, యలమంచిలి సబ్.రి, యలమంచిలి మున్సిపాలిటీ, యర్రవరం నెం.31 గ్రామం తాలూకు, సర్వేనెం. 103(1) లో, య.0.17ట్లు ఖాళీస్తలంనకు హద్దులు....

తూర్పు : కొలగాని వెంకటరమణ వగైరాల ఖళీస్తలం,
దక్షిణం : కర్రి రత్నం గారి భూమి
పడమర : శానాపతి వెంకటచలపతిరావు వగైరాల భూమి,
ఉత్తరం : పాత జాతీయరహదారి

యస్.వి.ఎ.ప్రసాదు,
అడ్వకేటు, యలమంచిలి,
అనకాపల్లి జిల్లా
యలమంచిలి
తేది. 29.12.2025
Cell: 7893802452

కష్టపడితేనే విజయం : సిపి

ప్రజాశక్తి-ఆనందపురం : విజయాన్ని సాధించాలంటే కష్టపడటం తప్ప మరో మార్గం లేదని నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి అన్నారు. ఆనందపురం మండలం బంటుపల్లి వారి కల్లాలలోని శ్రీ వివేకానంద జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఫేర్‌వెల్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. లక్ష్యంతో కూడిన చదువు అవసరమని, మంచి ఉద్యోగాలు పొందాలంటే అవసరమైన నైపుణ్యాలను ముందుగానే అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. కష్టపడి చదివితే టాప్ ర్యాంకులు సాధించవచ్చన్నారు. ముఖ్యంగా ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని, చదవడం, రాయడం, ప్రజెంటేషన్ చేయడంలో నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేసుకోవాలని, తరగతి గదిలోనే న్యూస్‌పేపర్ చదివే అలవాటు పెంచుకోవాలని చెప్పారు. చదువుతో పాటు ఆన్‌లైన్ కోర్సుల ద్వారా అదనపు జ్ఞానం సంపాదించాలని కోరారు. విద్యతో పాటు మానసిక, శారీరక ఆరోగ్యం కూడా ముఖ్యమని, తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ క్రమశిక్షణతో జీవించాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్నాయని, యువత అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. డ్రగ్స్, మద్యం, గంజాయి వంటి అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.

ఫేర్‌వెల్ కార్యక్రమంలో మాట్లాడుతున్న పోలీసు కమిషనర్ శంకబ్రత బాగ్చి

వెల్లంకి జడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు దాట్ల రమేష్‌కుమార్ మాట్లాడుతూ, ఇంటర్మీడియట్ విద్య కీలక దశ అని, ఆ సమయంలో విద్యార్థులు చదువుపై పూర్తి దృష్టి పెట్టాలన్నారు. కళాశాల అధినేత పైడి నాయుడు మాట్లాడుతూ, చదువే వ్యక్తిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లగలదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విలువలతో కూడిన విద్యను అందించి మధ్యతరగతి విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే శ్రీ వివేకానంద జూనియర్ కళాశాల లక్ష్యమని చెప్పారు. అనంతరం బోటనీ మాస్టర్ తాత్రాజు అప్పలరాజు ఇచ్చిన మోటివేషన్ స్పీచ్ ఆకట్టుకుంది. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో మీసాల శ్రీనివాసరావు, మీసాల అప్పలరాజు, నిమ్మల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఇద్దరు బైకిస్టుల దుర్మరణం

ప్రజాశక్తి- యలమంచిలి టౌన్ : బస్సు ఢీకొనడంతో బైకిస్ట్ దుర్మరణం పాలైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. అచ్యుతాపురం ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాలివి. మునగపాక గ్రామానికి చెందిన మొల్లేటి రాము (24) అచ్యుతాపురం ఎస్ఇజెడ్‌లోని సోలార ఫార్మా పరిశ్రమలో ఫిట్టర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం బి షిఫ్ట్ విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై వెళ్తుండగా వెళుతుండగా కొండకర్ల సమీపంలో లారస్ 2 సంస్థకు చెందిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, రాము ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాము పైనుంచి బస్సు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అందిన సమాచారం మేరకు సంఘటనాస్థలాన్ని సందర్శించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రికి తరలించారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

ఫార్మా బస్ ఢీకొనడంతో మృతి చెందిన మొల్లేటి రాము కుటుంబాన్ని ఆదుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ రాము డిమాండ్ చేశారు.

కుంపల్లి కూడలిలో మరొకరు...

దేవరాపల్లి : విశాఖపట్నం వెళ్లే మార్గంలో కుంపల్లి కూడలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని కె.ఎం.పాలెం గ్రామానికి చెందిన చౌడువాడ దేముడునాయుడు (26) అక్కడికక్కడే మృతి చెందాడు. ఇదే ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న అదే గ్రామానికి చెందిన గండం మహేష్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. దీనిపై మృతుని కుటుంబీకులు, ఆర్టీసీ కండక్టర్ రమణమ్మ చెప్పిన వివరాలివి. కృష్ణయ్యడు పేట జంక్షన్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న 12డి బస్సు కుంపల్లి కూడలికి చేరుకునే సమయంలో ద్విచక్ర వాహనం వస్తున్న ఇద్దరు యువకులు బస్సు తప్పించబోయి ప్రమాదవశాత్తు రోడ్డుపై పడ్డారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న దేముడునాయుడు తలకు బలమైన గాయం తగలడంతో అతడు అక్కడికక్కడే చనిపోయాడు. సముద్రంనాయుడు, రమణమ్మ దంపతుల రెండో కుమారుడైన దేముడునాయుడు ఇంటర్ పూర్తి చేసిన తరువాత తల్లిదండ్రులతో పాటు తన అన్నయ్య జగ్గారావుకి వ్యవసాయ పనుల్లో చేదోడు వాదోడుగా ఉండేవాడు. స్నేహితుడితో వెళ్లి వస్తానని చెప్పి బుధవారం ఉదయం ఇంటి నుంచి మహేష్ తో ద్విచక్ర వాహనంపై బయలుదేరిన కొడుకు అంతలోనే శాశ్వతంగా తమకు దూరమయ్యాడనే వార్త వెవిన పడిన అతని తల్లిదండ్రులు బోరున విలపించారు. తమ గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందడంతో కెఎం.పాలెంలో విషాదఛాయలు అలముకున్నాయి.

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని కొవ్వాడ గ్రామంలో ఉన్న సంస్కృతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రాంగణంలో బుధవారం ఈ ఏడాది 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఏడాది మొదటి సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ కావడంతో వీడ్కోలు వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ విజయ రామరాజు, డైరెక్టర్ సాయికృష్ణరాజు, ప్రిన్సిపల్ జగదీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-మధురవాడ : అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 13 మందికి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రూ.9.19 లక్షల విలువైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎంవిపి కాలనీలోని ఆయన నివాసంలో బుధవారం అందజేశారు. అనంతవరం, అయినాడ, కణమాం, రామవరం, వెల్లంకి సహ జివిఎంసి 3, 6, 8, 15, 98 వార్డులకు చెందిన లబ్ధిదారులు ఈ ఆర్థిక సాయాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక సమస్యలున్న వారు తన కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పివి.నరసింహం, లొడగల అప్పారావు, కూటమి నాయకులు చిక్కాల విజయ్‌బాబు, తాత్రాజు అప్పారావు, కోరాడ రమణ, కాళ్ల నగేష్ కుమార్, కసిరెడ్డి దామోదరరావు, బిఆర్‌బి.నాయుడు, కురుమిన లీలావతి, మొల్లి లక్ష్మణరావు, ఎర్ర రాజు, బలిరెడ్డి మల్లికార్జునరావు, గరే గుర్నాథ్, సత్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిలో కంటైనర్ పార్లర్ ప్రారంభం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని మద్ది జంక్షన్‌లో విశాఖ డెయిరీ కంటైనర్ పార్లర్‌ను డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో ఉన్న రైతులకు, ప్రజలకు స్వచ్ఛమైన డెయిరీ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయనగరం ఎంసిసి డైరెక్టర్ కోళ్ల కాటమయ్య, డెయిరీ సిఈఒ కెవి.ప్రసాద్, మేనేజర్ కె.వేణుగోపాల్, ఎంపిపి రాంబాబు, టిడిపి నాయకులు కె.నగేష్‌కుమార్, బి.ప్రకాష్ సూపర్‌వైజర్ మహేష్ పాల్గొన్నారు.

కూటమి పాలనలో ప్రజా సంక్షేమం గాలికి.. : వైసిపి

ప్రజాశక్తి -మధురవాడ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని వైసిపి భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు విమర్శించారు. మధురవాడ లా కాలేజీ రోడ్డులోని వైసిపి కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసిపి హయాంలో లక్షలది పెన్షన్లు అందిస్తే, నేటి కూటమి ప్రభుత్వం సుమారు 6 లక్షల పెన్షన్లలో కోతలు పెట్టిందని విమర్శించారు. గత 18 నెలలుగా కొత్త వితంతు పెన్షన్ల ఊసే లేదన్నారు. మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్న హామీని విస్మరించారని, 'బంగారు కుటుంబం' వంటి పథకాలు కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేశారని, మధ్యాహ్న భోజన పథకం అస్తవ్యస్తమైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గంజాయి విక్రయాలు, నేరాలు పెరిగిపోయాయని, మహిళల రక్షణ కోసం ఉన్న 'దిశ' యాప్‌ను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. ఎరువుల కొరతతో రైతులు అల్లాడుతున్నారని, గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ సమావేశంలో 4వ వార్డు కార్పొరేటర్ డి.కొండబాబు, 5, 6, 8 వార్డుల అధ్యక్షులు పోతిన హనుమంతరావు, పోతిన ప్రసాద్, గుడ్ల పోలిరెడ్డి, బొట్ట అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎపిటిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

ప్రమాణం చేస్తున్న ఎపిటిఎఫ్ నూతన కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండల ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఎపిటిఎఫ్) నూతన కమిటీ ఎన్నికలు శొంఠ్యాం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ఎపిటిఎఫ్ పూర్వ కార్యదర్శి బి.వెంకటపతిరాజు ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, భీమిలి పట్టణానికి చెందిన శ్రీనివాసం ఎన్నికల పరిశీలకులుగా హాజరై కౌన్సిల్ సమావేశాన్ని పర్యవేక్షించారు. ఈ ఎన్నికల్లో మండల ఎపిటిఎఫ్ అధ్యక్షునిగా జి.గంగాధరుడు, ప్రధాన కార్యదర్శిగా పి.రమేష్, ఉపాధ్యక్షులుగా అప్పలనాయుడు, టి.నారాయణరావు, ఎల్.కొండాజీ, కార్యదర్శులుగా జి.అప్పారావు, వి.సుధీర్, ఎస్.అప్పన్నబాబు, ఎ.హసీనా, జిల్లా కౌన్సిలర్లుగా యు.ఈశ్వరరావు, బి.ఈశ్వరరావు, పి.అప్పలనాయుడు, కె.కృష్ణ, బి.శ్రీనివాసరావు, పి.వరహమూర్తి, అకడమిక్ సెల్ కన్వీనర్లుగా ఎం.ఈశ్వరరావు, కె.శ్రీనివాసరావు, ఎస్.సూర్యనారాయణ, ఆడిట్ కమిటీ కన్వీనర్లుగా వి.అప్పాజీ, డి.శ్రీదేవి, సి.సాయి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చంద్రకళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటపతిరాజు మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే ఎపిటిఎఫ్ ప్రధాన లక్ష్యమన్నారు.

భూమి హక్కు పాస్ పుస్తకాలు పంపిణీకి గ్రామసభలు

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండల పరిధిలోని గ్రామాల్లో రైతులకు పాస్ పుస్తకాలు పంపిణీ చేసేందుకు గ్రామసభల షెడ్యూల్‌ను తహశీల్దార్ శ్రీనుబాబు విడుదల చేశారు. జనవరి 2 నుంచి 9వ తేదీ వరకు మండలంలోని 16 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి పాస్ పుస్తకాలను పంపిణీ చేయనున్నామని తహశీల్దార్ తెలిపారు. రైతులు తప్పనిసరిగా గుర్తింపు పత్రాలతో హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. గ్రామసభల్లో రైతుల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు ప్రభుత్వ పథకాలపై అవగాహన కూడా కల్పించనున్నట్లు తెలిపారు.

రహదారిపైనే మురుగు నీరు

ప్రజాశక్తి- తగరపువలస : భీమునిపట్నం మండలం కె.నగరపాలెం పంచాయతీలో రోడ్డు మురుగుమయంగా మారింది. ఈ రహదారిలో వేలాది మంది అవంతి కాలేజీ విద్యార్థులు, దివీస్ ఉద్యోగులు ప్రయాణిస్తుంటారు. గుడివాడ, చిప్పాడ, అన్నవరం, పెదనాగమయ్యపాలెం, చెరుకుపల్లి తదితర 10 గ్రామాలకు ప్రధాన రహదారిగా ఉంది. దివీస్ కంపెనీ వాహనాలు, పాఠశాలలు, కళాశాలల బస్సులు ఈ రోడ్డు గుండా ప్రయాణం సాగిస్తాయి. ఈ రహదారిపై సుమారు కిలోమీటర్ పొడవునా మురుగు నీరు నిల్వ ఉండటంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అవంతి కాలేజీ విద్యార్థులు మురుగు నీటిలోనుంచే నడవాల్సి వస్తోంది. హైవే పక్కన దుకాణాలకు అనుమతి కల్పించిన అధికారులు డ్రైనేజీ నిర్మించకపోవడంతో ఈ సమస్య తలెత్తింది. దుకాణాలు, హోటళ్ల నుంచి వాడుక నీరు రోడ్డు మీదుగా ప్రవహిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పరిష్కారం చూపాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

'సాయి రవీంద్ర'లో మ్యాజిక్ షో

ప్రజాశక్తి -తగరపువలస: వెంపాడ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యాన సాయి రవీంద్ర, శ్రీరామకృష్ణ విద్యాలయాల్లో బుధవారం మేజిక్ షో నిర్వహించారు. ప్రముఖ మేజిషియన్, జాతీయ అవార్డు గ్రహీత శ్రీనివాస్ పండిట్ పలు మేజిక్ ప్రదర్శనలతో విద్యార్థులను ఆకట్టుకున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని ఆనందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ మేజిక్ షో ద్వారా వచ్చిన కొంత డబ్బును తాళ్లవలసలోని భరోసా లిటిల్ హర్ట్స్ బాలల సంరక్షణ కేంద్రం పిల్లలకు ఆర్థిక సహాయంగా అందించారు. భరోసా లిటిల్ హర్ట్స్ బాలల సంరక్షణ కేంద్రం నిర్వాహకులు వెంపాడ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, మేజిక్ షో ద్వారా వచ్చిన డబ్బులను పిల్లలు సంరక్షణ కోసం సహకారం అందించిన సాయి రవీంద్ర, రామకృష్ణ స్కూళ్ల యాజమాన్యాలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి రవీంద్ర స్కూల్ కరస్పాండెంట్ బొగేల కృష్ణ, ప్రిన్సిపల్ వాండ్రసి సతీష్, రామకృష్ణ విద్యాలయం కరస్పాండెంట్ మానాపురం సాయికుమార్, శీను పాల్గొన్నారు.

అంతర కళాశాలల క్రీడల్లో 'అవంతి' విజయకేతనం

ప్రజాశక్తి -తగరపువలస : విజయనగరంలోని జెఎన్‌టియు గురజాడ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో డిసెంబర్ 29 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించిన అంతర కళాశాలల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో అవంతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. 18 ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల నుండి 200 మందికి పైగా అథ్లెట్లు పోటీలో తలపడ్డారు. ఈ పోటీలో తగరపువలస అవంతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు హైజంప్, ట్రిపుల్ జంప్ (ఎస్.మణికంఠ - రిలేగోల్డ్), లాంగ్ జంప్‌లో (ఎ.భార్గవ్, ఎస్.సాయి కిరణ్ - రిలే గోల్డ్), రన్నింగ్ 400 మీటర్ల పరుగులో (ఎం.ధరనేశ్వర్ - రిలే గోల్డ్) విజేతలుగా నిలిచారు. విజేతలైన విద్యార్థులను అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్లు డాక్టర్ ఎ.చంద్రశేఖర్, విశ్వప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు కోలా చంద్రశేఖర్, చంద్రరావు, శంకర్ అభినందించారు.

వాహన తనిఖీలు

ప్రజాశక్తి-వేపగుంట : బిఆర్‌టిఎస్ మెయిన్ రోడ్డులో పురుషోత్తపురం వద్ద పోలీసులు బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ నరసింహరాజు మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ లేకపోవడం వల్ల కలిగే అనర్థాలను ద్విచక్ర వాహనదారులకు వివరించారు. కారు నడిపే వారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని చెప్పారు. యువకులు మితిమీరిన వేగంతో ద్విచక్ర వాహనాలను నడపడం వల్ల పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. నూతన సంవత్సరం వేడుకల్లో ఇటువంటి సంఘటనలు జరగకూడదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి నూతన సంవత్సర వేడుకలను ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

అప్పన్న నిత్యాన్నదాన పథకానికి విరాళం

ప్రజాశక్తి- వేపగుంట : సింహగిరిపై ఉన్న శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కొనసాగుతున్న 'శ్రీ సింహాద్రి నాథ నిత్య అన్నప్రసాద' పథకానికి విశాఖపట్నం పాండురంగాపురానికి చెందిన పి.ఎ.అభిలాష్, దివ్య దంపతులు రూ.5 లక్షలు విరాళాన్ని అందజేశారు. ప్రోటోకాల్ ఆఫీస్‌లోని డొనేషన్ కౌంటర్ వద్ద విరాళానికి సంబంధించిన చెక్కును దేవస్థాన అధికారులకు బుధవారం సమర్పించారు. దాతలకు దేవస్థానం అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించారు. ఆలయ వేద పండితులు దాతలకు వేద మంత్రాలతో ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షణాధికారి కె.వెంకటేశ్వరరావు, పిఆర్‌ఒ నాయుడు, వరహ నర్సింహం పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో గాయత్రి కళాశాల ప్రతినిధులు

'గాయత్రి' ప్రాంగణ నియామకాల్లో 220 మంది ఎంపిక

ప్రజాశక్తి-మధురవాడ : గాయత్రీ విద్యా పరిషత్‌లో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 220 మంది ఎంపికైనట్లు సంస్థ యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. ఈ డ్రైవ్‌లో టాటా ఎలక్ట్రానిక్స్ (బెంగళూరు), ఫ్లెక్సానిక్స్ (చెన్నై), మదర్సన్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ (చెన్నై) కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయని పేర్కొన్నారు. ప్రీ-ప్లేస్మెంట్‌లో కంపెనీల హెచ్‌ఆర్ ప్రతినిధులు విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. ఎంపికైన విద్యార్థులను గాయత్రి విద్యా పరిషత్ వైస్ ప్రెసిడెంట్ డి.దక్షిణామూర్తి, ప్రిన్సిపల్ ఆచార్య కెఎస్ బోస్, ప్లేస్‌మెంట్ అధికారి ఆచార్య సరిత, యుజి డైరెక్టర్ డి.గిరిధర్ అభినందించారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్లను సమర్థవంతంగా నిర్వహించిన ప్లేస్‌మెంట్ విభాగం అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. మరింత మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కళాశాల నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు.

సింహాచలంలో వైభవంగా 'రాపత్తు' ఉత్సవాలు

ప్రజాశక్తి- వేపగుంట : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ధనుర్మాస మహోత్సవాలు ఆధ్యాత్మిక శోభతో అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్.సుజాత ఆదేశాల మేరకు, వైష్ణవ సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు 'రాపత్తు' వేడుకలు నిర్వహించారు. రాపత్తు ఉత్సవాల్లో భాగంగా సింహాద్రి అప్పన్న స్వామి బుధవారం కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి రూపమైన "తిరువేంగడ ముడయాన్" అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఉత్సవాల్లో భాగంగా స్వామివారిని వేదమంత్రాలు, నాదస్వర వాయిద్యాల మధ్య అత్యంత వైభవంగా తిరివీధి పల్లకి సేవ నిర్వహించారు. ఈ వేడుకల్లో డాక్టర్ టిపి.రాజగోపాల్, ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, సీతారామాచార్యులు, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షణాధికారి కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

3న మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని కృష్ణాపురం పంచాయతీ పరిధిలో ఉన్న స్ప్రింగ్ ఫీల్డ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో ఆచార్య రత్నరాజు అమ్మ వర్ధంతిని పురస్కరించుకొని ఉచిత వైద్య శిబిరాన్ని పాఠశాల ప్రాంగణంలో ఈ నెల 3వ తేదీన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి, తగరపువలస అనీల్ నీరుకొండ వైద్యులచే పరీక్షలు నిర్వహించి మందులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

సార్వత్రిక సమ్మెలో భాగస్వాములు కావాలి

ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్జీత్ కౌర్

ప్రజాశక్తి- సీతమ్మధార : కార్మికుల చట్ట బద్ధ హక్కుల రక్షణ కోసం ఫిబ్రవరి 12వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం భాగస్వాములు కావాలని ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్జీత్ కౌర్ పిలుపునిచ్చారు. 'లేబర్ కోడ్లు, భారతీయ ఆర్థిక వ్యవస్థపై ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ప్రభావం' అనే అంశంపై బుధవారం పౌర గ్రంథాలయంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా అమర్జీత్‌కౌర్ హాజరై మాట్లాడుతూ, లేబర్ కోడ్‌లు అమలుతో భారతీయ శ్రామిక వర్గం బ్రిటిషు కాలం నాటి బానిసలుగా మారే ప్రమాదం ఉందన్నారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో అగ్రభాగాన నిలబడి పోరాడిన భారతీయ కార్మిక వర్గం స్వాతంత్ర్యానికి ముందే 8 గంటల పని దినం, సంఘం పెట్టుకునే హక్కు, వేతన చట్టం, బోనస్ చట్టం పారిశ్రామిక వివాదాల చట్టం, బొగ్గు గనుల చట్టం, సమ్మె హక్కు తదితర చట్టాలు సాధించుకుంటే వీటన్నిటిని కోడ్‌ల రూపంలో మార్పు చేసి మోడీ ఉత్తర్వులు ఇవ్వడం కార్పొరేట్లకు, కార్మికవర్గాన్ని తాకట్టు పెట్టడమేనని విమర్శించారు. వేతన కోడ్ ద్వారా గతంలో ఉన్న వేతన బోర్డులకు కాలం చెల్లినట్టేనని, జీతాలు ఎగవేసే యజమానులను నిలదీసే అధికారం లేబర్ కమిషనర్‌కు లేకుండా మార్పు చేశారని తెలిపారు. సోషల్ సెక్యూరిటీ కోడ్ వల్ల కార్మికులు సాధించుకున్న సంక్షేమ బోర్డులు, పథకాలు రద్దుచేశారని, 40 శాతం కార్మిక వర్గాన్ని ఇఎస్ఐ, పిఎఫ్ పథకాలకు దూరం చేశారని, కార్మికులు సమ్మె చేయాలంటే 50 శాతం ఆమోదం ఉండాలని వివరించారు. ప్రభుత్వ రంగ సంస్థలలో కార్మికుల శ్రమ ద్వారా వచ్చే ఆదాయం దేశ సంపదను ప్రపంచ మార్కెట్లో అగ్రభాగాన నిలబెట్టిందన్నారు. అలాంటి ప్రభుత్వ రంగ సంస్థలు విశాఖ స్టీల్‌ప్లాంటు, భారతీయ వాయు రంగం, బొగ్గు, చమురు, విద్యుత్, రంగాలు అన్ని అదానికి కట్టబెడితే దేశం మళ్లీ ఈస్ట్ ఇండియా బనియా చేతుల్లోకి, కార్మికులు బానిసత్వంలోకి నెట్టివేయబడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటుకు వెళితే దాని ప్రభావం ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయంపై తీవ్రంగా ఉంటుందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా జరిగే సార్వత్రిక సమ్మెలో పాల్గొని విశాఖ స్టీల్‌ప్లాంట్, పోర్టు, రక్షణ రంగాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో జిఎస్‌జె.అచ్యుతరావు, బిసిహెచ్.మసెన్, డి.ఆదినారాయణ, పడాల రమణ, మన్మథరావు, బూసి వెంకటరావు, కె.సత్యాంజనేయ, వామనమూర్తి, చంద్రశేఖర్, కాశిరెడ్డి సత్యనారాయణ, పదాల గోవింద్, షేక్ మౌలాలి పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్జీత్ కౌర్

పులిహోర ప్రసాదం దుష్ప్రచారంపై ఫిర్యాదు

ప్రజాశక్తి- వేపగుంట : సింహగిరి శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో భక్తులకు అందజేసే పులిహోర ప్రసాదంపై సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవమని, దురుద్దేశపూర్వకమని దేవస్థాన అధికారులు స్పష్టం చేశారు. ఈ అంశంపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆలయ అధికారులు ప్రకటించారు. పులిహోర తయారీలో వాడే మిర్చి, ఆవాలు, శనగపప్పు తదితరాలను అత్యంత జాగ్రత్తగా శుభ్రపరిచిన తర్వాతే వినియోగిస్తారని తెలిపారు. తయారీ, ప్యాకింగ్ చేసేటప్పుడు నిరంతర పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్నారు. బాగా వేడి చేసిన తర్వాత తయారయ్యే పులిహోరలో పురుగు సజీవంగా ఉండే అవకాశం లేదని వివరించారు. ప్రసాదం ప్యాకెట్ కొనుగోలు చేసిన తర్వాత బయటకు వెళ్లి, కొంత సమయం తర్వాత తిరిగి వచ్చి పురుగు ఉందని చూపించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డైరీలు, కేలండర్ల ఆవిష్కరణ

కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న సత్తి రామకృష్ణారెడ్డి తదితరులు

ప్రజాశక్తి-సీతమ్మధార : శ్రీలక్ష్మి వెంకటేశ్వర మాక్ సొసైటీ రూపొందించిన 2026 కేలండర్‌ను లలితనగర్‌లోని కార్యాలయంలో చైర్మన్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ సత్తి రామకృష్ణారెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2026 సంవత్సరం ప్రతి ఒక్కరూ సంతోషంగా, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. సొసైటీ అభివృద్ధిలో విశాఖ ప్రజలు చూపించిన ప్రేమనురాగాలు మరవలేనివన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు వీరరాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ హెల్త్ మిషన్ డైరీ ఆవిష్కరణ

నూతన సంవత్సరం సందర్భంగా నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు రూపొందించిన డైరీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ పిజగదీశ్వరరావు బుధవారం ఆవిష్కరించారు. నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల నూతన సంవత్సర కేలండర్‌ను కూడా ఆవిష్కరించారు. మొదటి డైరీ, కేలండర్‌ను డాక్టర్ రమేష్, డాక్టర్ ఉమావతికి అందించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల యూనియన్ గౌరవాధ్యక్షులు శశిభూషణ్, జిల్లా ప్రెసిడెంట్ సురేష్, సెక్రటరీ వీరబ్రహ్మం, నాగరాజు, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

డైరీ, కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న డిఎంహెచ్‌ఒ జగదీశ్వరరావు

ఉపాధ్యాయులు వృత్తికి అంకితం : ఎమ్మెల్సీ

పద్మావతి దంపతులను సన్మానిస్తున్న శ్రీనివాసులునాయుడు

ప్రజాశక్తి -తగరపువలస : ఉపాధ్యాయులు వృత్తికి అంకితమై పనిచేస్తారని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ జి.శ్రీనివాసులునాయుడు తెలిపారు. స్థానిక అంబేద్కర్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు మొకర పద్మావతి ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, విద్యారంగంలో మొకర పద్మావతి లాంటి ఉపాధ్యాయులు ఉండటంతో విద్యా ప్రమాణాలు పెరిగాయన్నారు. ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొందిన వెంటనే రావలసిన డబ్బు చెల్లించవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయు అవార్డు గ్రహీత మురళీమోహన్ మాట్లాడుతూ, వృత్తికి అంకితమై పనిచేసిన టీచర్‌కు ఎంతటి ఆదరణ లభిస్తుందో పద్మావతి విరమణ కార్యక్రమం చూస్తుంటే అర్థమవుతుందన్నారు. పాఠశాల అభివృద్ధి కోసం తపించే ఉపాధ్యాయులు పూజింపబడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గంటా నూకరాజు, కొప్పుల రమేష్, దిండి వెంకటేష్, ఎంఇఒ ఎం.శివరాణి, జయప్రభ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సుపరిపాలన సర్టిఫికెట్లు అందజేత

ప్రజాశక్తి- మధురవాడ, భీమునిపట్నం : సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగా పనిచేసిన ఉత్తమ కార్యకర్తలకు సర్టిఫికెట్లను ఎంవిపి.కాలనీలోని నివాసంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం అందించారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలతో పాటు జివిఎంసి 1, 2, 3, 4, 5, 7, 98 వార్డులకు చెందిన 40 మందికి సర్టిఫికెట్లు ఇచ్చారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం కార్యకర్తలకు అండగా ఉంటారన్నారు. ఏ రాజకీయ పార్టీలో లేని విధంగా టిడిపిలో కార్యకర్తల సంక్షేమ నిధిని ఏర్పాటుచేసిన ఘనత మంత్రి నారా లోకేష్‌కు దక్కుతుందన్నారు. కార్యకర్తలకు టిడిపిలో తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో కూటమి నేతలు చిక్కాల విజయ్‌బాబు, పివి.నరసింహం, తాట్రాజు అప్పారావు, బిఆర్‌బి.నాయుడు, కోరాడ రమణ, కసిరెడ్డి దామోదరరావు, కాళ్ల నగేష్‌కుమార్, కురుమిన లీలావతి తదితరులు పాల్గొన్నారు.

'దక్షిణం'లో అభివృద్ధి : వంశీకృష్ణ

ప్రజాశక్తి-సీతమ్మధార : దక్షిణ నియోజకవర్గంలో గత 18 నెలలో రూ.50 కోట్లతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సీతంపేటలోని జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమర్థవంతంగా అందించామని తెలిపారు. నియోజకవర్గంలో రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి జరుగుతుందని, రూ.120 కోట్లతో పూర్ణామార్కెట్‌ను అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధికి విశాఖ పోర్టు సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. దక్షిణ నియోజకవర్గంలో రూ.6 కోట్లతో నైట్ ఫుడ్ కోర్టును ఏర్పాటుచేస్తామని తెలిపారు. కెజిహెచ్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు శివప్రసాద్‌రెడ్డి, డాక్టర్ మర్రివేముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
గురువారం 1 జనవరి 2026

ప్రభుత్వ రంగంతోనే విశాఖ నగరాభివృద్ధి

ఉమ్మడి రాష్ట్రంలోనే రెండో పెద్ద నగరంగా విశాఖ ఉంది. రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్‌లో అతి పెద్ద నగరం ఇదే. స్వాతంత్ర్యానికి పూర్వం ఒక చిన్న మత్స్యకార గ్రామంగా ఉన్న విశాఖ నేడు అతి పెద్ద నగరంగానూ, ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న వంద నగరాలలో ఒకటిగానూ ఉండడానికి ప్రధాన కారణం.. నగరంలో నెలకొన్న ప్రభుత్వ రంగ పరిశ్రమలే. ఇంకా విశాలంగా చెప్పాలంటే.. ప్రభుత్వ రంగ సంస్థలు దేశాభివృద్ధిలోనూ, దేశ స్వావలంబన సాధించడంలోనూ ప్రముఖ పాత్ర నిర్వహించాయి. అందుకే దేశ మొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ రంగ పరిశ్రమలను ఆధునిక దేవాలయాలని అభివర్ణించారు. కానీ నేటి పాలకులు అటువంటి సంస్థలను ధ్వంసం చేయడమే ఒక విధానంగా పెట్టుకున్నారు.

1901 సంవత్సరంలో 40,892 మందిగా ఉన్న నగర జనాభా విశాఖ పోర్టు ట్రస్టు ఏర్పడిన తరువాత 1951 కల్లా రెట్టింపుకుపైగా పెరిగింది. హిందూస్థాన్ షిప్‌యార్డ్ స్థాపనతో ఈ పెరుగుదల క్రమం మరింత పుంజుకుంది. 1951-61 మధ్య పదేళ్ల కాలంలోనే నగర జనాభా రెట్టింపు పెరిగి 2.15 లక్షలకు చేరుకుంది. బిహెచ్‌పివి ఏర్పడిన తరువాత 1971 నాటికి 3,68,000కు జనాభా చేరింది. నేవల్ డాక్‌యార్డ్ విస్తరణ, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఏర్పడిన తరువాత 1991 కల్లా జనాభా 13.57 లక్షలకు పెరిగింది. ఇదంతా ప్రభుత్వ సంస్థల వల్లనే జరిగింది. ప్రభుత్వ సంస్థలలో మెరుగైన ఉపాధికై అనేక మంది గ్రామీణ ప్రాంతాల నుండి నగరానికి వలసలు వచ్చారు. వీటితో పాటు హెచ్‌పిసిఎల్, బ్యాంకులు, ఇతర ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల వల్ల 2011లో 17.43 లక్షలు, 2021లో 22.26 లక్షల జనాభా ఉంది. నేడు విశాఖ నగర జనాభా సుమారు 25 లక్షలుగా ఉంది.

ఈ ప్రభుత్వ సంస్థల నిర్మాణం వల్ల వాటిలో పనిచేసే ఉద్యోగుల గృహవసతి, గృహోపకర వస్తువులు వంటి అవసరాలు తీర్చడానికి సర్వీసు రంగం అభివృద్ధి అయింది. ఈ జనాభా ఆహార అవసరాల కోసం సమీప గ్రామాలలో కూరగాయల పంటలు పెరిగాయి. ఇలా పారిశ్రామికీకరణ వల్ల వ్యవసాయ, సర్వీసు రంగాలు కూడా అభివృద్ధి జరిగి, అనేక మందికి ఉపాధి అవకాశాలు కల్పించబడ్డాయి.

కేవలం జనాభా పెరగడమే కాక, ఇతర అవసరాలకు నగర వైశాల్యం కూడా క్రమంగా పెరుగుతూ వస్తోంది. నేడు 681 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో దేశంలోనే మూడో పెద్ద నగరంగా నిలిచింది. ఈ పారిశ్రామికీకరణ వల్ల 3,67,529 కోట్ల రూపాయల స్థూల జాతీయ ఉత్పత్తితో దేశంలో తొమ్మిదో సంపన్న నగరంగా ఉంది. వార్షిక బడ్జెట్ 4,171 కోట్ల రూపాయలుగా ఉంది.

అయితే 1991 నుండి దేశంలో అమలవుతున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాల వల్ల ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ప్రారంభమైంది. వీటి ప్రభావం విశాఖ నగరంపై కూడా సహజంగానే బలంగా పడింది. మహారత్న కంపెనీగా ఉన్న హిందూస్థాన్ జింక్ పరిశ్రమను పూర్తిగా అమ్మేయడం, తరువాత మూతబడడం జరిగింది. విశాఖపట్నం పోర్టు, షిప్‌యార్డ్, బిహెచ్‌పివి, డాక్‌యార్డ్ వంటి సంస్థలలో శాశ్వత ఉద్యోగుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఉదాహరణకు విశాఖపట్నం పోర్టులో 1991 నాటికి 13,019 మంది శాశ్వత కార్మికులుండగా 2021 నాటికి కేవలం 2,700 మంది మాత్రమే ఉన్నారు. షిప్‌యార్డులో 6,795 నుండి ఇదే కాలంలో కార్మికుల సంఖ్య 530 మందికి పడిపోయింది. బిహెచ్‌పివి 4 వేల నుంచి 550కు తగ్గిపోయింది.

విశాఖ నగరానికే కాక, రాష్ట్రానికే తలమానికంగా ఉన్న విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న ఈ భారీ పరిశ్రమ ప్రభుత్వ రంగం నుంచి వైదొలగడమంటే అది విశాఖ అభివృద్ధికి అశనిపాతమే. దీనిని పరిరక్షించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని పారిశ్రామిక విధానాలు ప్రకటించినా ఫలితం శూన్యమే. ఆధునిక టెక్నాలజీ, ఓడరేవు కలిగి దేశంలోనే విశిష్ట స్థానంలో నిలిచిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడే భాధ్యత రాష్ట్ర ప్రయోజనాల రీత్యా రాష్ట్ర ప్రభుత్వంపైనా ఉంది.

నగరాభివృద్ధిలో విశేషమైన పాత్ర పోషించిన ఇటువంటి ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడం ద్వారానే అభివృద్ధిని సుస్థిరం చేసుకోవడం, మరింత అభివృద్ధి సాధించడం సాధ్యం. సాధారణ ప్రజానీకం, అభివృద్ధి కాముకులు ఈ దిశలో కృషి చేసి, ప్రభుత్వం ప్రయివేటీకరణ విధానాలను ఉపసంహరించుకునేలా ఒత్తిడి తేవడమే నేటి కర్తవ్యం. ఎన్నికల ముందు స్టీల్ ప్లాంట్‌ను కాపాడతామని హామీ ఇచ్చిన తెలుగుదేశం, జనసేన పార్టీలు ఆ హామీకి కట్టుబడి ఉండేలా రాష్ట్ర ప్రజలు చైతన్యం చూపాలి. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం సిఐటియు సమరశీల పోరాటాలు నిర్వహిస్తోంది. ఆ సంఘం అఖిల భారత మహాసభ విశాఖలో ప్రస్తుతం జరుగుతుండటం గర్వకారణం.

- ఎ.అజశర్మ,
ప్రధాన కార్యదర్శి,
ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

ఐదో రోజూ అదే జోష్

విజయనగరం కళాకారుల పులివేషాల ప్రదర్శన

ఆద్యంతం ఉత్సాహంగా ఆట పాట

చైతన్యం నింపిన గేయాలు

అబ్బుర పరిచిన పులివేషాలు

ప్రజాశక్తి-భీమునిపట్నం

సిఐటియు అఖిల భారత మహాసభల నేపథ్యంలో ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శ్రామిక ఉత్సవ్ పేరిట ఐదో రోజు బుధవారం ప్రజానాట్య మండలి కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు, అభ్యుదయ గేయాలు.. ఉత్తరాంధ్ర జానపద కళాకారుల పులివేషాలు అబ్బుర పరిచాయి. "పని గంటలు పెంచి నారు కార్మికుడా.. ఇది తగదంటూ నినదించు శ్రామికుడా", "మానసిక ఒత్తిడికి లోనవుతాను.. శారీరక శక్తినంతా కోల్పోతాను", "గ్యారెంటీ లేని కొలువులు చేస్తావు" అంటూ కళాకారులు పాడిన పాటలు సభికులను ఉత్సాహ పరిచాయి. కార్మికులు తమ శారీరక శక్తినంతా ధారపోసి సంపద సృష్టిస్తున్నా సరే ఉద్యగ భద్రత లేని పరిస్థితులను వివరించారు

ఉత్సాహంగా నృత్యం చేస్తున్న పిఎన్‌ఎం కళాకారులు

కళాకారులు. విజయనగరం జిల్లాకు చెందిన కళాకారులు ప్రదర్శించిన పులివేషాలు అబ్బుర పరిచాయి. "తెలుగు పండగలు తెల్ల బోయి.. ఇంగ్లిష్ పండగలు ఎక్కిలిస్తున్నాయి", రైతన్నా ఎట్టేట్టో బతికేటోడివి.. ఇట్టేట్టా ఐతివో రైతన్నా.. అంటూ కళాకారులు పాడిన పాటలు సభికులను హత్తుకునేలా చేశాయి. రైతులు సంప్రదాయ బద్ధంగా చేసుకునే భోగి, సంక్రాంతి పండగలు నిర్వచనం మారేలా నిర్వహించుకోవడాన్ని పాడిన పాటలు సభికులను ఆలోచింపజేశాయి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసమని గిరిజనులను, ఆయా ప్రాంత ప్రజలను గోదాట్లో ముంచేస్తే ఊరుకోబోమని, ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాల్సిందేనని చెబుతూ "అమ్మ పీక నొక్కేసి.. అడవి నుంచి గెంటేసి.. పద పద పద మనది ఒకటే మాటై.. పోరుబాటకై.. ఎర్రజెండా మా వెంటే నడుస్తుంది..' అంటూ కళాకారులు పాడిన పాట ఆద్యంతం ఆలోచనలు రేకెత్తించింది.

"కార్మికులం.. శ్రామికులం. తరతరాల దోపిడీకి నలిగిన కూలీలం.. గాలి, నీరు, భూమంతా నీ సొంతమా? గానుగెద్దు లాంటి బతుకు మాకు సొంతమా" అంటూ సినీ దర్శకులు బాబ్జీ ఒకింత ఆవేశంగా పాట పాడారు. పెట్టుబడి దారుల ప్రయోజనాల కోసం పాలకులు ఎలా వ్యవహరిస్తున్నది ఆయన క్లుప్తంగా పాట ద్వారా వివరించారు.

డ్రగ్స్ అనర్థాలపై పిఎన్ఎం కళాకారుల ప్రదర్శన

సాగర తీరంలో కార్మికోత్తేజం

విశాఖ సాగర తీరాన బుధవారం కార్మిక పండగ ఆరంభమైంది. బీచ్ రోడ్డు ఎర్రబారింది. ఒకవైపు ఎయు కన్వెన్షన్ సెంటర్ వెనుక ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో సాగుతున్న శ్రామిక ఉత్సవ్, మరోవైపు అసలు పెద్ద పండగైన సిఐటియు అఖిల భారత మహాసభ.. వెరసి ఈ రెండింటి సందడి అందరిలో ఉత్తేజం నింపాయి. దేశ నలుమూలల నుంచి కార్మిక రంగ ప్రతినిధులు ఈ మహాసభకు తరలివచ్చారు. సోదర కార్మిక సంఘాలు సౌహార్థ సందేశాలిచ్చాయి. శ్రామిక ఉత్సవ్‌కు సినీ దర్శకుడు బాబ్జీ ముఖ్య అతిథిగా హాజరై చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. సాహిత్య వేదికపై కవులు, రచయితలు తమ కవితలు, వ్యాఖ్యానాలతో సందడి చేశారు.

మాట్లాడుతున్న బాబ్జి, వేదికపై సుబ్బరావమ్మ, ప్రొఫెసర్ చలం తదితరులు

మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలి

'శ్రామిక ఉత్సవ్'లో సినీ దర్శకుడు, రచయిత బాబ్జి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

'దేశంలో ఖనిజ, అటవీ సంపదను ఇద్దరు గుజరాతీలు అమ్ముతుంటే ఇద్దరు గుజరాతీలు కొంటున్నారు. మనది అనేది ఏదీ లేకుండా చేయటమే ప్రస్తుత పాలకుల లక్ష్యం. కార్పొరేట్లకు అన్నింటినీ దోచిపెడుతున్నారు' అని సినీ దర్శకులు, రచయిత బాబ్జి అన్నారు. ఈ క్రమంలో మరో స్వాతంత్ర్య ఉద్యమానికి అందరం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిఐటియు 18వ అఖిల భారత మహాసభ సందర్భంగా విశాఖ నగరంలో నిర్వహిస్తున్న 'శ్రామిక ఉత్సవ్' బుధవారానికి ఐదో రోజుకు చేరింది. 'సమాన పనికి సమాన వేతనం' అనే థీమ్‌తో సభ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు బిడ్డగా తనను గుర్తించినందుకు ధన్యవాదాలు తెలిపారు. 'ఒక్కసారి అయినా కమ్యూనిస్టుగా బతుకు' అనే పాట రాసిన రచయితగా గుర్తించడం ఆనందదాయకమన్నారు. సిఐటియు అఖిల భారత మహాసభ విశాఖపట్నం నడిబొడ్డున జరుగుతున్న సందర్భంగా తాను ఇక్కడకు వచ్చానని, తాను విద్యార్థిగా ఉన్నప్పుడు విశాఖపట్నం ప్రజానాట్యమండలిలో పాటలు నేర్చుకున్నానని గుర్తు చేసుకున్నారు. ఆనాటి నుండి ఈనాటి వరకు కార్మికులు, వారిపై జరుగుతున్న దోపిడీపై పాటలు రాస్తూనే ఉన్నానని తెలిపారు. గాంధీజీ, గద్దర్, అల్లూరి మన హీరోలని చెప్పారు. చిన్ననాటి నుండి అల్లూరి విప్లవ భావాలు కలిగిన తనకు విశాఖ అంటే మక్కువ అని చెప్పుకొచ్చారు. బ్రిటిష్ పాలకులు చిన్నచిన్న వ్యాపారాల పేరుతో వచ్చి చాప కింద నీరులా ఎలా వ్యాపించారో.. ఇప్పుడు గుజరాతీయులు కూడా అలాగే వ్యాపిస్తున్నారని తెలిపారు. దేశం బానిసత్వంలోకి వెళ్లే ఛాయలు కనపడుతున్నాయని అన్నారు. మరో స్వాతంత్ర పోరాటం కోసం సిఐటియు జాతీయ మహాసభ పిలుపునివ్వాలన్నారు. విశాఖపట్నాన్ని కాపాడుకునేందుకు సిఐటియు జాతీయ మహాసభలో ప్రతిపాదన చేయాలని కోరారు. సినిమా అనేది ఆనందం, ఆటపాటల కోసం మాత్రమే కాకుండా స్థానిక ప్రజలను చైతన్యవంతులు చేసేందుకు ఉపయోగపడుతుందన్నారు. తాను సినీ పరిశ్రమలో కార్మికుల హక్కుల కోసం పనిచేస్తున్నానన్నారు. సినిమా అనేది లక్షల మందికి చేరే ఒక ప్రధాన సాధనమని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ స్త్రీ-పురుష సమానత్వం, కార్మిక-కర్షక ఐక్యత, లౌకిక విలువల కోసం ఈ నెల 27 నుంచి శ్రామిక ఉత్సవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా, దేశంలోని 40 శాతం సంపద కేవలం ఒక శాతం మంది వ్యక్తుల వద్దే పేరుకుపోయిందని ఆమె విమర్శించారు. న్యాయస్థానాలు ఆదేశిస్తున్నా 'సమాన పనికి సమాన వేతనం' అమలు కావడం లేదని, స్కీమ్ వర్కర్ల శ్రమను పాలకులు దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో సరైన ఆహారం అందక ప్రతిరోజూ 8 లక్షల మంది చిన్నారులు మరణిస్తుండటం శోచనీయమన్నారు. గుజరాత్ హైకోర్టు సూచించిన విధంగా కనీస వేతనం రూ.24,800 అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కేరళను పేదరికం లేని రాష్ట్రంగా నీతి ఆయోగ్ ప్రకటించడం వామపక్ష ప్రభుత్వ సమర్థతకు నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ద్రవిడ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ కెఎస్.చలం, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు అజయ్ కుమార్, జిల్లా కోశాధికారి జ్యోతీశ్వరరావు, శ్రామిక ఉత్సవ్ కన్వీనర్ రమాదేవి, పెద్ద సంఖ్యలో కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రొఫెసర్ కెఎస్.చలం

మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

కళాకారులను అభినందిస్తున్న నిర్వాహకులు

బాబ్జీకి జ్ఞాపిక అందజేత

తప్పెటగుళ్ల కళాకారుల ప్రదర్శన

అల్లూరి స్మారక జ్యోతితో సిహెచ్.నర్సింగరావు, అనకాపల్లి జిల్లా నాయకులు

వేదికపై కార్మిక సంఘ అగ్రనేతలు

ప్రతినిధులకు స్వాగతం

సౌహార్థ సందేశాలిస్తున్న నాయకులు

శ్రామిక ఉత్సవ్‌లో పెంచలయ్య భార్య దుర్గ తదితరులు

ప్రశంసా పత్రాలతో తప్పెటగుళ్ల కళాకారులు

మహాసభ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నాయకులు, ప్రతినిధులు

మహాసభ ప్రాంగణంలోని కళాకృతులు

కార్మికులకు అండ... సిఐటియు జెండా

విజయనగరం జిల్లాలో సిఐటియు కార్మికులకు అండగా నిలుస్తోంది. 1977లో ఏర్పాటై క్రమక్రమంగా విస్తరించిన సిఐటియు.. నేడు జిల్లాలో బలమైన కార్మిక సంఘంగా ఎదిగింది. జ్యూట్, రైస్ మిల్లులు, ఫెర్రో ఎల్లాయిస్, చక్కెర ఫ్యాక్టరీలు, ఆయిల్‌మిల్లుల కార్మికులతోపాటు విఆర్ఎ, విఆర్ఓ, పారిశుధ్య కార్మికులు, స్కీమ్‌వర్కర్లయిన అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు... ఇలా ఒకటా రెండా అనేక రంగాల్లోని కార్మికులంతా సిఐటియులో చేరి తమ హక్కుల సాధనకు, సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తున్నారు. 1977లోనే విజయనగరం జిల్లాలో సిఐటియు ఏర్పాటుకు బీజాలు పడ్డాయి. క్రమక్రమంగా వివిధ రంగాలకు విస్తరించి 1991లో బొబ్బిలిలో సిఐటియు జిల్లా ప్రథమ మహాసభ నిర్వహించుకుంది. అప్పటి నుంచి వెనుతిరగకుండా కార్మికుల పక్షాన నికరంగా నిలబడి సమరశీల పోరాటాలు నిర్వహిస్తోంది.

విశాఖ జిల్లాలో విజయనగరం రెవెన్యూ డివిజన్‌లో భాగంగానే నెల్లిమర్ల జ్యూట్ మిల్లును బ్రిటిష్ వారే నిర్మించారు. బ్రిటిష్ పెట్టుబడిదారులే ఈస్టుకోస్టు జ్యూట్ మిల్లు కూడా నిర్మించారు. క్రమంగా అరుణ, బొబ్బిలిలో గోపాలకృష్ణ, కొత్తవలసలో ఉమా, సాలూరులో జీగిరాం జ్యూట్ మిల్లులు నిర్మాణం జరిగింది. కార్మిక సంఘాల నిర్మాణం విషయంలో యజమాని, ప్రభుత్వం నిర్బంధాన్ని ఎదుర్కొని కార్మికులు తీవ్రంగా పోరాడారు. క్రమంగా గరివిడి ప్రాంతంలో మైనింగ్‌తోపాటు ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీ, బొబ్బిలి, సీతానగరంలో రెండు చక్కెర ఫ్యాక్టరీలు ఏర్పడ్డాయి. విజయనగరం, బొబ్బిలి, సాలూరు, పార్వతీపురం మున్సిపాలిటీల్లో మున్సిపల్ కార్మికులు, గర్భాంలో ఆయిల్ మిల్లులు, రైస్ మిల్లుల కార్మికులు.. సంఘాలు ఏర్పాటు చేసుకునేందుకు యజమానికి తెలిస్తే ఉద్యోగానికే ముప్పు కనుక అతి రహస్యంగా అష్టకష్టాలు పడ్డారు. ఇదో సుదీర్ఘ చరిత్ర.

1975 ఎమర్జెన్సీ అనంతరం 1977 ఎన్నికల తరువాత పశ్చిమ బెంగాల్లో సిపిఎం నాయకత్వంలో వామపక్ష ప్రభుత్వం ఏర్పడటం, బెంగాల్‌లోని జ్యూట్‌మిల్లుల్లో సిఐటియు బలంగా ఉండటంతో చిట్టివలస, నెల్లిమర్ల, అరుణ, ఈస్ట్ కోస్టు, ఉమా జ్యూట్ మిల్లుల్లో కార్మికులు సిఐటియులో చేరారు. ఫలితంగా వీటన్నింటిలోనూ నాయకత్వంలోకి వచ్చారు. కార్మిక సమ్మె పోరాటాలు, బెంగాల్‌లో జ్యోతిబసు ప్రభుత్వం సహకారంతో మంచి ఒప్పందాలు జరిగాయి. వీటికి ప్రత్యక్ష నాయకత్వం ఎస్.గంగాధర రెడ్డి, దారా బూచి వహించారు. అనంతరం ఈ మిల్లులన్నీ ఐఎఫ్‌టియు నాయకత్వంలోకి వెళ్లడం, అనేక సార్లు అక్రమ లాకౌట్లు జరగడం, ఆ క్రమంలోనే నెల్లిమర్లలో జ్యూట్‌మిల్లు కార్మికులు చేపట్టిన రైలురోకోలో భాగంగా 1994 జనవరి 29న పోలీసు కాల్పుల్లో ఐదుగురు కార్మికులు మరణించారు.

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా విజయనగరం కలెక్టరేట్ ఎదుట సిఐటియు ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న కార్మికులు (ఫైల్)

బిహెచ్‌పివి సిఐటియు నాయకుడు జి.సుబ్బారావు చొరవతో స్వామినాయుడు సహకారంతో 1989లో సాలూరు ఫిలడెల్ఫియా ఆసుపత్రిలో సిఐటియు అనుబంధ సంఘం ఏర్పాటు చేయడం, నాయకత్వం వహిస్తున్న కామ్రేడ్‌ను తొలగించడం, న్యాయస్థానంలో గెలుపొందడం జరిగింది. జీగిరాం జ్యూట్ మిల్లు, సాలూరు మున్సిపల్ వర్కర్స్, సివిల్ సప్లై కళాసీలు, మినీ మోటార్ వర్కర్స్‌లోకి సిఐటియు విస్తరించింది.

1990లో బొబ్బిలి గోపాలకృష్ణ జ్యూట్‌మిల్లులో సిఐటియు అనుబంధ సంఘం పెట్టి అనేక పోరాటాలు చేశారు. జ్యూట్‌మిల్లు 13 నెలల అక్రమ లాకౌట్‌పై వీరోచిత పోరాటం చేసి విజయం సాధించారు. బొబ్బిలిలో హోటల్, ప్రెస్‌వర్కర్స్, బొబ్బిలి, సీతానగరం చక్కెర ఫ్యాక్టరీలకు, మున్సిపల్ వర్కర్స్‌లోకి విస్తరించింది. అనంతరం నవ్య, జ్యోతి జ్యూట్ మిల్లులు, గ్రోత్ సెంటర్‌లో ఫ్యాక్టరీలకు, బొబ్బిలి నుంచి బలిజిపేట రైస్‌మిల్లుల కళాసీలకు సంఘం విస్తరించింది.

పార్వతీపురం రైస్ మిల్లుల కళాసీలు, షాపు ఎంప్లాయిస్, మోటార్ వర్కర్స్‌కు, ఎఫ్‌సిఐ కళాసీల్లోకి, హోటల్, ప్రెస్, మున్సిపల్ వర్కర్స్‌లోకి, సినీ వర్కర్స్, గరుగుబిల్లి రైస్ మిల్స్ కళాసీ సంఘంలోకి, గుమ్మలక్ష్మీపురం లైజాన్ వర్కర్స్, కురుపాం, గుమ్మలక్ష్మీపురం జిసిసి కళాసీలకు సిఐటియు క్రమంగా విస్తరించింది. కార్మికులంతా సిఐటియు గొడుగు కిందకు వచ్చారు. ఇదే కాలంలో కొత్తవలస ప్రాంతంలో ఆంధ్రా ఫెర్రో, పెంకుల మిల్లుల్లో సిఐటియు అనుబంధ సంఘాలు ఏర్పాటై సమరశీల పోరాటాలు చేపట్టడం ద్వారా మంచి అగ్రిమెంట్లు జరిగాయి. పెంకుల మిల్లులో కార్మికులు సమ్మె చేస్తుండగా యజమాని కొత్త కార్మికులతో పని ప్రారంభించారు.దీంతో కార్మికులు ఆ యజమానిని కొడుతూ కిలోమీటర్లు మేర నడిపించి తగిన శాస్తి చేశారు. ఇంకా అనేక సంఘాలకు సిఐటియు విస్తరించి కొత్తవలస ప్రాంతంలో సమరశీల సంఘంగా నిలిచింది.

ఇదే కాలంలో విజయనగరంలో షాపు ఎంప్లాయిస్ యూనియన్ ఏర్పడింది. బొమ్మన, చందన షాపుల్లో సంఘం బలంగా నిలబడి పెద్ద సమ్మె, పోరాటాలు చేసింది. బొమ్మన బ్రదర్స్ బట్టల షాపులో 90 రోజులు సమ్మె చేసి కనీస వేతనం అమలు చేయించింది. చందనలో కూడా కనీస వేతనాలు అమలు చేయించింది. ఇది చారిత్రక విజయమే. స్పాన్ పైపుల కంపెనీకి తరువాత అరుణ, ఈస్ట్ కోస్ట్ జ్యూట్ మిల్లులకు, మున్సిపల్ వర్కర్స్‌లోకి సిఐటియు విస్తరించింది. మున్సిపల్ వర్కర్స్, ముఠా కళాసీలు, జిసిసి ఎంప్లాయిస్‌లోకి, భీమసింగి షుగర్ ఫ్యాక్టరీ, పూసపాటిరేగ వెరా కంపెనీకి, హెచ్‌బిఎల్ కార్మికుల్లోకి విస్తరించింది. వెరా లేబోరేటరీస్‌లో సమ్మె చేసి మంచి ఒప్పందం చేసింది. హెచ్‌బిఎల్‌లో వీరోచిత పోరాటం జరిగింది. అక్కడ నుంచి విజయనగర బయోటెక్‌కూ విస్తరించింది.

1995 తరువాత గరివిడి ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలో సిఐటియు అనుబంధ సంఘం పెట్టడం, అక్కడి నుంచి డిఫైన్ మైనింగ్ కంపెనీకి, గర్భాం ఆయిల్, చీపురుపల్లి రైస్ మిల్లులకు విస్తరించింది. ప్రెస్ వర్కర్స్ సంఘం, చీపురుపల్లి వైర్ యూనిట్‌కు విస్తరించింది. గర్భాం ఆయిల్ మిల్లులో సమ్మె, సమరశీల పోరాటం జరిగాయి. ఫేకర్ అక్రమ లాకౌట్‌కు వ్యతిరేకంగా దాదాపు 6 నెలలు సమరశీల పోరాటాలు చేపట్టింది. ఆ పోరాట ప్రభావంతో స్థానిక ఎన్నికల్లో సిపిఎం తరపున కార్మికులే అభ్యర్థిని నిలబెట్టి గెలిపించారు.

మెడికల్ అండ్ హెల్త్‌లో ఇక్కడ నుండే పోరాటం ప్రారంభించి రాష్ట్ర సంఘం నిర్మాణానికి కృషి చేసింది సిఐటియు. రెండో ఎఎన్ఎంల నియామకాల కోసం వీరోచితంగా పోరాడింది. ఫలితంగా జిల్లా ఎన్‌జిఒల్లో బలంగా నిలబడింది. ఆర్‌టిసి, విద్యుత్, అంగన్వాడీ, ఆశా సమస్యలు, మధ్యాహ్న భోజనం కార్మికులు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వేలాది మందితో పోరాటాలు నిర్వహించింది.

1991లో బొబ్బిలిలో సిఐటియు ప్రథమ జిల్లా మహాసభ జరిగింది. రాష్ట్ర కేంద్రం నుంచి శ్రీహరి హాజరయ్యారు. సిఐటియు విస్తరణలో వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ స్టడీ సర్కిల్ ముఖ్యపాత్ర పోషించింది. ఎల్ఐసి ఉద్యోగులు సిఐటియు అభివృద్ధిలో వెన్నుదన్నుగా నిలిచారు. నాటి నుంచి నేటివరకు జిల్లాలోని అన్ని రంగాల్లోనూ సిఐటియు కార్మికులతో పెనవేసుకుపోయింది.

ఈ క్రమంలో కార్మికులు తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు, హక్కులను పరిరక్షించుకునేందుకు ఎన్నో బెదిరింపులు, నిర్బంధాలు ఎదుర్కొన్నారు. మరిన్ని సమస్యలు పరిష్కరించుకుని యాజమాన్యాల మెడలు వంచారు. కొన్ని దశాబ్దాలుగా జిల్లాలో ప్రధానమైన జ్యూట్, ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు మూతపడటం వల్ల జిల్లా పారిశ్రామికంగా మరింత వెనుకబడింది. ఈస్ట్‌కోస్ట్, అరుణ, బొబ్బిలి గోపాలకృష్ణ, జ్యోతి జ్యూట్ మిల్లులు మరికొన్ని పరిశ్రమల స్థలాలు రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారిపోయాయి. ప్రస్తుతం నడుస్తున్న జ్యూట్ పరిశ్రమలు గానీ, ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలు గానీ పూర్తి సామర్థ్యంతో నడవడం లేదు. శాశ్వతంగా మూసివేసిన నాలుగు జ్యూట్‌మిల్లుల్లో 10 వేల మంది కార్మికులకు, ప్రస్తుతం ఉన్న మిల్లుల్లో పూర్తి సామర్థ్యంతో నడవకపోవడం వల్ల 5 వేల మందికి ఉపాధి పోయింది. మొత్తంగా పరిశీలిస్తే పారిశ్రామిక రంగంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 వేల మంది కార్మికులు శాశ్వతంగా ఉపాధి దూరమయ్యారు. ఈ ప్రభావం విజయనగరం, గరివిడి, కొత్తవలస, బొబ్బిలి ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. పారిశ్రామిక సంక్షోభాన్ని అధిగమించి జిల్లాలో నిలదొక్కుకుంటున్న మైలాన్, హెబిఎల్, సిపి ఆక్వా, ఎస్ఎంఎస్, విజయనగర్ బయోటెక్ పరిశ్రమలతో పాటు హేచరీస్, పౌల్ట్రీస్ తదితర పరిశ్రమల్లో కార్మికులు రకరకాల సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఆ రంగం, ఈ రంగం కాదు.., అన్ని రంగాల్లోనూ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు రెండో ఎఎన్ఎం, విఆర్ఎలు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన తదితర స్కీమ్ వర్కర్ల సమస్యలైతే అన్నీ ఇన్నీ కావు. ప్రభుత్వం అవలంభిస్తున్న మోసపూరిత విధానం వల్ల ఉద్యోగ భద్రత లేదు. పనికి తగ్గ వేతనం లేదు. పని ఒత్తిడి ఎక్కువైంది. బండెడు చాకిరీ చేస్తున్నా రాజకీయ వేధింపులు తప్పడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో వీరందరికీ సిఐటియు అండగా నిలుస్తూ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తోంది. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వల్ల జరుగుతున్న కష్టనష్టాలను కార్మికవర్గానికి వివరిస్తూ, చైతన్య పరుస్తూనే సమస్యల పరిష్కారానికి ఉద్యమాలను తీవ్రతరం చేస్తోంది.

- ఎం.కృష్ణమూర్తి
సిఐటియు పూర్వ సీనియర్ నాయకులు

సాహిత్యం.. జీవితాన్ని ప్రతిబింబించాలి

ప్రజాశక్తి-గాజువాక

జీవితాన్ని ప్రతిబింబించేలా సాహిత్యం రావాలని కథా రచయిత్రి కత్తి పద్మ అభిలాషించారు. శ్రామిక ఉత్సవ్ జరుగుతున్న సాహితీ వేదికపై 'సాహిత్యంలో దళిత, ఆదివాసీ, మహిళ ఆవరణాలు' అనే అంశంపై బుధవారం జరిగిన సభలో ఆమె మాట్లాడారు. ఉత్తరాంధ్ర నైసర్గిక స్వరూపం చాలా గొప్పదన్నారు. సముద్రం, కొండలు, మైదాన ప్రాంతాలు, దళితులు, ఆదివాసీలు నివసించే ప్రాంతమని అన్నారు. విశాఖ నగరంలో అనేక మురికి వాడలు ఉన్నాయని చెప్పారు. ఇందులో మత్స్యకార గ్రామం జాలారిపేట ఉందన్నారు. ఈ జాలారిపేటలో మహిళలకు ఆర్థిక స్వావలంబన ఎక్కువని, ఆర్థిక స్వేచ్ఛ కూడా ఉంటుందని వివరించారు. వీరి వివాహ వ్యవస్థ కూడా చాలా గొప్పదని తెలిపారు. ఇంతవరకు వరకట్న హత్యలు జరగని ప్రాంతంగా చెప్పుకొచ్చారు. దీన్ని సాహిత్య ఆవరణలోకి తీసుకురావల్సి ఉందని అభిప్రాయపడ్డారు. విశాఖలో ఉన్న మురికివాడను తొలగించాలని ప్రభుత్వాలు చేసిన ప్రయత్నానికి అప్పుడు చేసిన తీవ్రమైన పోరాటాలు, ప్రతిఘటనలు కూడా సాహిత్య ఆవరణలోకి ఎంచుకోవాలని కోరారు. అప్పుడే వాస్తవ సాహిత్యం వస్తుందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులు ప్రయివేటీకరణ వల్ల నష్టపోయిన అంశాలు,

సాహిత్య సభలో మాట్లాడుతున్న కథా రచయిత్రి కత్తి పద్మ

కథా రచయిత్రి కత్తి పద్మ

కార్మికుల కుటుంబాల్లో మహిళలు, వారి పిల్లలు ఆ పోరాటంపై ఏమనుకుంటున్నారో సాహిత్యం ద్వారా వెలుగులోకి తేవాలని సూచించారు.

ఉత్తరాంధ్రలో సోంపేట పోరాటం తెగువ చూపించిందని గుర్తుచేశారు. ఆ పోరాటం పాలకులకు బుద్ధి చెప్పిందన్నారు. దాన్ని సాహిత్యంలోకి ప్రతిపాదించాలన్నారు. ఆదివాసీల్లో ఆహార సేకరణ ఎక్కువగా మహిళలపై ఆధారపడి ఉంటుందన్నారు. ఆదివాసీల సంస్కృతి చాలా గొప్పదని, దాన్ని పట్టుకోవాలని కోరారు. ఆదివాసీల్లో అద్భుతమైన జీవన సౌందర్యం దాగి ఉందని వివరించారు. ఈ సమాజంలో ప్రధాన సమస్యలు ఉన్నాయని, వాటిపై చర్చ జరగాల్సి ఉందని చెప్పారు. తక్షణ సమస్యలపై ఏవిధంగా పోరాటం చేస్తామో, అదేవిధంగా సాహిత్యంపైన, కళారంగంపైన, మేధావులు, కవులు కదలాలని పిలుపునిచ్చారు.

కవి కంచరాన భుజంగరావు మాట్లాడుతూ సాహిత్యంలో స్త్రీవాద, దళితవాద, ఆదివాసీ సాహిత్య పాయలు చాలా కొత్త అంశాలను వస్తువులుగా సేకరించాయన్నారు. ప్రొఫెసర్ కెఎస్ చలం మాట్లాడుతూ అస్తిత్వంలో అనే భావనలలో చాలా సమస్యలు ఉన్నాయన్నారు. సంఘటితంగా విముక్తికై కదలాల్సి ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా భుజంగరావు పూరేడు పిట్ట అనే కవితను వినిపించారు. మతం అనేది మనలో లేదని కవితను పాణిగ్రహి పాడి వినిపించారు. అనంతరం వీరికి సర్టిఫికెట్లు, మెమోంటోలను నిర్వాహకులు అందజేశారు.

రిటైర్డ్ పోలీసు అధికారులకు సత్కారం

సుందరరాజు, అప్పలరాజులను సత్కరిస్తున్న అడిషనల్ ఎస్‌పి

ప్రజాశక్తి-అనకాపల్లి : పోలీసు శాఖలో సుదీర్ఘకాలం పాటు విశిష్ట సేవలు అందించి బుధవారం ఉద్యోగ విరమణ పొందిన ఏఆర్‌ఎస్‌ఐ కె.సుందర రాజు, మహిళా పోలీస్ స్టేషన్ ఎఎస్‌ఐ ఎ.అప్పలరాజులను జిల్లా పోలీసు శాఖ ఘనంగా సత్కరించింది. జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో వీరికి ఆత్మీయ వీడ్కోలు సభను నిర్వహించారు. అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని, ఉద్యోగవిరమణ పొందిన అధికారులను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేసి అభినందించారు. అనంతరం మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం ఎంతో ఒత్తిడితో కూడుకున్నదని, అటువంటి బాధ్యతాయుతమైన ఉద్యోగంలో నాలుగు దశాబ్దాలపాటు నిబద్ధతతో పనిచేయడం సామాన్యమైన విషయం కాదన్నారు. ఆర్మ్ రిజర్వ్, ఉమ్మడి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో వీరు అందించిన సేవలు శాఖకు గర్వకారణమని కొనియాడారు. విశ్రాంత జీవితంలో జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందనిహామీ ఇచ్చారు.డిఎస్‌పి జిఆర్‌ఆర్.మోహన్, ఎఒ సిహెచ్.తిలక్ బాబు, సిఐలు ఎస్.బాల సూర్యారావు, బి.రామకృష్ణ, బి.రమణమూర్తి, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి పాలనలో అభివృద్ధి

ప్రజాశక్తి -మునగపాక: ఐదేళ్ల అస్తవ్యస్త పాలన నుంచి రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమబాటలో ముందుకు నడిపిస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ అన్నారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేసిన సూపర్ సిక్స్ పథకాలకు ప్రజలలో విశేష ఆదరణ ఉందన్నారు.

గీత కార్మికులకు మద్యం షాపుల్లో 10 శాతం రిజర్వేషన్లు, మహిళలకు కుట్టు మిషన్లు, పరిశ్రమల అభివృద్ధి, విద్యుత్ చార్జీల తగ్గింపు, విశాఖ రైల్వే జోన్, జాతీయ ప్రాజెక్టులు తదితర అభివ ద్ధి కార్యక్రమాలలో ప్రభుత్వం ముందుకు పోతోందన్నారు.. 2025లో రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ ఫలాల చంద్రబాబు, పవన్‌కల్యాన్ మార్క్ పాలనకు నిదర్శనమన్నారు. స్వర్ణాంధ్ర సాధన దిశగా రాష్ట్రంలో అభివృద్ధికి వీరు బలమైన పునాది వేశారని స్పష్టం చేశారు.

శతశాతం ఇంటర్ ఫలితాలు లక్ష్యం

ప్రభుత్వ జూనియర్ కాలేజీ వార్షికోత్సవంలో డిఐఇఒ వినోద్‌బాబు

ప్రజాశక్తి- దేవరాపల్లి : జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షల్లో శతశాతం మెరుగైన ఫలితాల సాధనే లక్ష్యంగా ప్రణాళికాయుతంగా విద్యార్థులనుసిద్ధం చేస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియేట్ అధికారి (డిఐఇఒ) ఎం.వినోద్‌బాబు తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ 48వ వార్షికోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాధ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో మాట్లాడుతూ రానున్న పరీక్షల్లో మంచి మార్కులు సాధించడమే లక్ష్యంగా పెట్టుకుని, పట్టుదలతో చదవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మాట్లాడుతున్న డిఐఇఒ వినోద్‌బాబు

విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ

అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, జిల్లాలో ఈ ఏడాది ఇంటర్ సెకండియర్‌లో 2,862 మంది, ఫస్టియర్‌లో 3,261 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. మెరుగైన ఫలితాలకు వీరికి సంకల్పం కార్యక్రమం ద్వారా అదనపు తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.. ప్రతిరోజూ పరీక్షలు నిర్వహించి, వెనకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామన్నారు.ఈనెల 21 నుంచి మానవతా విలువలపై పరీక్షలు, ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు ప్రాక్టికల్స్, ఫిబ్రవరి 23 నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రారంభమవనున్న నేపథ్యంలో విద్యార్థులను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ కూడా మంగళవారం వెబ్‌ఎక్స్ ద్వారా కళాశాల ప్రిన్సిపాళ్లతో సమీక్షించారన్నారు.. కళాశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి 'డోనార్ యాప్' ద్వారా ప్రతిపాదనలు పంపించగా, ప్రతి కాలేజీ నుంచి రూ.20 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు అవసరాలను నమోదు చేసినట్లు వెల్లడించారు.జిల్లా అధ్యాపక సిబ్బంది కొరత లేదన్నారు. ప్రతి శనివారం సెకెండియర్ విద్యార్థులకు ఎంసెట్, నీట్ కోచింగ్ ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. సైన్స్ అధ్యాపకులకు యలమంచిలి జూనియర్ కళాశాలలో ప్రతి శనివారం ఓరియంటేషన్ క్లాసులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులను ఎబిసి గ్రేడ్‌లుగా విభజించి, సి గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధ్యాపకులను ఆదేశించామన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం

ప్రజాశక్తి -అనకాపల్లి : ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని దిబ్బపాలెం గ్రామ సర్పంచ్ పీల ఉషా అప్పారావు అన్నారు. అనకాపల్లి జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ లచ్చన్న ఆదేశాల మేరకు దిబ్బపాలెం గ్రామంలో 13 మంది రైతులకు పిజిఎస్ సర్టిఫికెట్లును సర్పంచ్‌తోపాటు మార్కెటింగ్ అధికారి అప్పలరాజు 13 మంది రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లాలో ప్రథమంగా దిబ్బపాలెం గ్రామ ప్రకృతి వ్యవసాయ రైతులను గుర్తించి ఈ కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగ. పరుచుకున్నందుకు ప్రాజెక్టు తరఫున దిబ్బపాలెం సర్పంచ్ అభినందించారు.

ప్రకృతి వ్యవసాయం విధానం వలన భూమి ఆరోగ్యం కాపాడటమే కాక మన ఆరోగ్యాలను, పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఆరోగ్యవంతమైన చిరుధాన్యాలు నవధాన్యాలు పండ్లు కూరగాయలు ఆకుకూరలు పండించి ఎల్లప్పుడూ ప్రతి ఒక్క రైతు మార్కెటింగ్ చేసి మంచి ఆదాయాలను పెంచుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఐసిఆర్‌పిఎస్ సిబ్బంది స్వాతి, మహాలక్ష్మి, ఎఫ్‌ఎంటిలు నాగేశ్వరరావు, అప్పా రావు, విల్లూరు వీరునాయుడు,విల్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : మండలంలోని పోతిరెడ్డిపాలెం గ్రామంలో క్రిస్టియన్ మహిళలకు బుధవారం స్థానిక సర్పంచ్ ఇత్తంశెట్టి సన్యాసినాయుడు చీరలను పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి సామాజిక పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా క్రిస్టియన్లకు, ప్రజలకు నూతన సంవత్సరం, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపి, చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

చీరలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సన్యాసినాయుడు

హామీల అమలుపై ప్రశ్నిస్తే రౌడీషీట్ దుర్మార్గం

- ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి : విద్యారంగ సమస్యలపై ఉద్యమించే విద్యార్థి యువజన నాయకులపై కేసులు పెట్టడం, రౌడీషీట్ ఓపెన్ చేయడం దుర్మార్గమని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.బాబ్జి, జి.ఫణీంద్ర కుమార్ విమర్శించారు. బుధవారం స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తప్పుడు కేసులు పెట్టినవి తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎత్తేస్తానని హామీ ఇచ్చి నేడు ఉద్యమాల పాత కేసులు తోడి విద్యార్థి నాయకుల పై రౌడీ షీట్ ఓపెన్ చేస్తారా అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం విద్యార్థులను మోసం చేస్తుందని ప్రశ్నిస్తే ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్ నాయకుల పైన రౌడీషీటా అని ప్రశ్నించారు ఎన్నికల హామీలు అమలు చేయాలని ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్,ఏఐవైఎఫ్ నాయకుల పైన విశాఖపట్నంలో రౌడీషీట్ ఓపెన్ చేయడాన్ని ఖండించారు. పాత కేసులు తోడి నేడు విశాఖపట్నంలో ఐదుగురు విద్యార్థి యువజన నాయకులపై పెట్టిన రౌడీషీట్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సంతోష్, అఖిల్, రమేష్, కల్యాణి, పూజ పాల్గొన్నారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి : బాల్య వివాహ ముక్త్ భారత్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం అనకాపల్లి ఎడి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో విద్యార్థులకు బాల్యవివాహాల అనర్థాలపై అవగాహన కల్పించారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి ఎమ్. రమేష్, ఎన్‌జిసి ప్రాజెక్ట్ ఆఫీసర్ మనోహర్, ఎల్‌సిపిఒ రమాదేవి, సోషల్ వర్కర్ మంగ , ఔట్ రీచ్ వర్కర్ రమ్య, ప్రిన్సిపాల్ లక్ష్మీ, ఎస్. ఉమా మహేశ్వరి, కోఆర్డినేటర్ బి స్వాతి, స్కూల్ స్టాఫ్ పాల్గొన్నారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి . రమేష్‌మాట్లాడుతూ, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, . చిన్నవయసులో పెళ్లి చేసుకోవడం వల్ల శారీరక మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. ఎల్‌సిపిఒ రమాదేవి, ఎన్‌జిసి పిఒ మనోహర్ బాల్యవివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు.

జాతీయ స్కూల్ చెస్ పోటీల్లో సత్తా

పతకం అందుకుంటున్న శ్రావ్యశ్రీ

ప్రజాశక్తి -యస్ రాయవరం : ఈనెల 27 నుండి 31 వరకు జరిగిన14వ జాతీయ స్కూల్ చెస్ ఛాంపియన్ పోటీలు అండర్ 14 విభాగంలో రాయవరం గ్రామానికి చెందిన బాలిక భీమశెట్టి శ్రావ్య శ్రీ సత్తా చాటింది. అసోం గౌహతిలోని సరసజ ఇండోర్ స్టేడియం లో నిర్వహించే పోటీల్లో భీమశెట్టి శ్రావ్య శ్రీ ద్వితీయ స్థానంలో నిలిచింది. త్వరలో జరగబోయే ఆసియా స్కూల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు మాజీ వైస్ ఎంపిపి తెలిపారు.

షటిల్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి- కశింకోట : ఈనెల 4న స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పుట్టినరోజు సందర్భంగా నిర్వహిస్తున్న కశింకోట మండల స్థాయి షటిల్ టోర్నమెంట్‌ను సీఐ అల్లు సోమనాయుడు బుధవారం రాత్రి ప్రారంభించారు కార్యక్రమంలో ఎస్ఐ మనోజ్ కుమార్, మాజీ ఎంపిటిసి దాడి నాగరాజు, పెంటకోట గోవింద పాల్గొన్నారు.

ఎన్‌జిఒల రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ప్రసాద్

ప్రజాశక్తి- సబ్బవరం: మండలంలోని వంగలి గ్రామానికి చెందిన తానుబెల్లి ఫౌండేషన్ ప్రతినిధి పొట్నూరి ప్రసాద్ ను ఆంధ్రప్రదేశ్ నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ (ఎన్‌జిఒ) వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా పొట్నూరి ప్రసాద్ మాట్లాడుతూ తానుబెల్లి ఫౌండేషన్ చేస్తున్న సేవలను గుర్తించి తనను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించడంపై ఆనందం వ్యక్తం చేశారు.

అనకాపల్లి ఆసుపత్రిలో అరుదైన సహజ ప్రసవం

వైద్యుల కృషి, చొరవకు వైద్యమంత్రి సత్యకుమార్ అభినందన

నవజాత శిశువు, బాలింతతో వైద్యులు, సిబ్బంది

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రి అసాధారణ, అరుదైన ఘటనకు వేదికగా నిలిచింది. ఇక్కడ సూపర్ స్పెషాలిటీ సదుపాయాలు లేకున్నా వైద్యులు శ్రమతో కూడుకున్న ప్రసవాన్ని సహజంగా జరిపారు. దీంతో పండంటి మగ బిడ్డకు ఆ తల్లి జన్మనిచ్చింది. శిశువు బరువు 4.8 కేజీలు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు. ఈమెకు ఇది రెండో కాన్పు. వైద్య సిబ్బంది చొరవను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందించారు. ఇదే స్ఫూర్తిని కొత్త సంవత్సరంలోనూ కొనసాగించాలని సూచించారు.

వివరాల్లోకి వెళితే పెందుర్తి ప్రాంతానికి చెందిన కె. రూపవతి 9 నెలలు నిండడంతో నొప్పులతో మంగళవారం అర్ధరాత్రి జిల్లా ఆసుపత్రిలో చేరింది. ఈమెకు 8నెలలో నిర్వహించిన అల్ట్రాసౌండ్ స్కానింగ్ ద్వారా శిశువు బరువు 3 కేజీలుగా ఉన్నట్లు భావించారు. 9 నెలలు నిండిన అనంతరం శిశువు బరువు మరింత పెరిగినందున సిజేరియన్ లేదా సహజ ప్రసవం చేసేందుకు వైద్యులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే శిశువు తల ముందుకు వచ్చినప్పటికీ భుజాలు రావడంలో సమస్య తలెత్తింది. శిశువు బరువుగా ఉన్నందున తల ముందుకు వచ్చినట్లు భుజాలు బయటకు వచ్చేందుకు సాధ్యపడలేద 'వుడ్స్ కార్క్ స్క్రూ ' (మ్యాన్‌అవర్) విధానంలోని మెళకువలను పాటించి, భుజాలు బయటకు వచ్చేలా వైద్యులు చేశారు. దీంతో సిజేరియన్ కు బదులు సహజ ప్రసవం జరిగింది. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు. సెకండరీ ఆసుపత్రుల్లో ఇలాంటివి జరగడం చాలా అరుదని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధరబాబు తెలిపారు. సుమారు 4 గంటలపాటు వైద్యులు డాక్టర్ సౌజన్య డాక్టర్ మానస (పీజీ థర్డ్ ఇయర్ స్టూడెంట్), స్టాఫ్ నర్సులు జగదీశ్వరి, జే.కుమారి, ఎఎన్‌ఎం సరస్వతి శ్రమించారని తెలిపారు.

మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందన

నూతన సంవత్సరంలోనూ ఇటువంటి చొరవ ప్రభుత్వాసుపత్రుల్లో కొనసాగాలన్న ఆకాంక్షను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సత్యకుమార్ యాదవ్ వ్యక్తం చేశారు. అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో నెలకు 400 వరకు ప్రసవాలు జరుగుతుంటే అందులో 65% నుంచి 70% వరకు సహజ ప్రసవాలు జరుగుతున్నాయని తెలిపారు. సహజ ప్రసవాల నిర్వహణకు వైద్యులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వైద్యులు, అధికారులకు మంత్రి సత్యకుమార్ అభినందనలు.తెలిపారు.

గ్రోయిన్ల అభివృద్ధికి కృషి

శారద గ్రోయిన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

ప్రజాశక్తి- అనకాపల్లి : జివిఎంసి 82వ వార్డు విజయరామరాజుపేట సమీపాన శారదా నది ప్రాంతాన్ని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ బుధవారం పరిశీలించారు. శారదానదిలో గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పూర్తిగా శిథిలమైన గ్రోయిన్స్, నాగులపల్లి వెళ్ళే పంట కాలువ, కాలువ లాక్స్ పరిశీలించారు. గ్రోయన్స్, పంటకాలువల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరుకు కృషి చేస్తానని, గ్రోయన్లను బాగుచేయించే చర్యలు చేపడతానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీష్, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, 82 వ వార్డు కూటమి నాయకులు పాల్గొన్నారు.

రైల్వే అండర్ పాస్ స్థల పరిశీలన

అనకాపల్లి మండలం సత్యనారాయణపురం నుంచి మూలపేట, సత్యనారాయణపురం మార్గంలో సరైన రోడ్డు లేక ఇబ్బంది పడుతున్న ప్రజలకు రైల్వే అండర్ పాస్‌కు స్థలం రోడ్డును బుధవారం ఎమ్మెల్యే కొణతాల పరిశీలించారు. అతి త్వరలోనే ఈ పనులు మొదలుపెట్టే విధంగా చర్యలు చేపడతారన్నారు. అండర్ పాస్ పూర్తయితే గ్రామాలకు రోడ్డు సమస్య ఉండదని అన్నారు.

ధాన్యం కొనుగోలు చేపట్టాలి

ప్రజాశక్తి -మునగపాక: రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేపట్టాలని వైసిపి అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహశీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ప్రసాద్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ముగిసి, ధాన్యం సిద్ధమైన ప్పటికీ కొనుగోళ్లు చేపట్టకపోవడం సరికాదన్నారు. ధాన్యం నిల్వ చేసేందుకు గిడ్డంగులు లేని పరిస్థితుల్లో సిద్ధం చేసిన వెంటనే కొనుగోలు చేపట్టాలన్నారు. రైతులు దిమ్మల అప్పారావు, బొడ్డేడ శ్రీనివాసరావు,భీశెట్టి గంగ అప్పలనాయుడు, బొడ్డేడ బుజ్జి, ఆడారి లక్ష్మణరావు, నరాల శెట్టి సూర్యనారాయణ, రాజాన బుజ్జిబాబు, ఆడారి కాశీబాబు పాల్గొన్నారు.

రేపటి నుంచి ధాన్యం కొనుగోలు

మండలంలోని చూచుకొండ గ్రామంలో ఈ నెల 2 నుంచి ధాన్యం కొనుగోలు చేపడతామని ఎఒ జ్యోత్స్నకుమారి తెలిపారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారన్నారు.

డ్రగ్స్ అనర్థాలపై విద్యార్థుల ఫ్లాష్‌మాబ్

ప్రజాశక్తి- సబ్బవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల అనర్థాలపై విద్యార్థుల సామాజిక చైతన్యం, అవగాహన కు బుధవారం ఫ్లాష్‌మాబ్ నిర్వహించినట్లు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా దేశభక్తి గీతాలతో పాటు, పాపులర్ సినీ గీతాలకు విద్యార్థుల నృత్యాలు అలరించాయి. పొలిటికల్ సైన్స్ అధ్యాపకురాలు రజని నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ గణేష్ లెక్కల పాల్గొన్నారు.

ముత్తూట్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం గ్రామంలో ముత్తూట్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక ప్రజలతోపాటు ఖాతాదారులకు బిపి, సుగర్, ఇతర పరీక్షలు ఉచితంగా నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ డి. నాగరాజు, క్లస్టర్ మేనేజర్ కె.వెంకటేష్, రీజినల్ మార్కెటింగ్ మేనేజర్ కె. వీరాజు, తాళ్ళపాలెం బ్రాంచ్ మేనేజర్ కె.శివ కుమార్, సిఎస్ఆర్, బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : నూతన సంవత్సరం సందర్భంగా ఒకరోజు ముందే లబ్ధిదారులకు పింఛన్లు అందజేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే చెందుతుందని శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అన్నారు. 82వ వార్డు విజయరామ రాజుపేట, ముది రాజ్ వీధిలో వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీష్, గవర కార్పొరేషన్ చైర్మన్ మల్లా సురేంద్ర పాల్గొన్నారు.

బాంబు బెదిరింపులపై ఎన్‌టిపిసిలో అబ్బురపరచిన మాక్‌డ్రిల్

మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న సిఐఎస్ఎఫ్ బలగాలు

ప్రజాశక్తి -పరవాడ: పరిశ్రమల ప్రాంతాల్లో భద్రతను మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో బాంబ్ బెదిరింపులు, వాటిని నిర్వీర్యం చేయడం, పేలితే చేపట్టాల్సిన సహాయక చర్యలపై బుధవారం ఎన్‌టిపిసి ప్రాంగణంలో మాక్‌డ్రిల్ విజయవంతంగా నిర్వహించారు. జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు ఎన్‌టిపిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మ, సిఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ రాజ్ కుమార్, పరవాడ సిఐ ఆర్. మల్లికార్జునరావు ఆధ్వర్యంలో బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, సిఐఎస్ఎఫ్ బలగాలు పాల్గొన్నాయి. మాక్ డ్రిల్ లో భాగంగా ఎన్‌టిపిసి ప్రాంగణంలో అనుమానా స్పదంగా గుర్తించిన నమూనా బాంబును భద్రతా బృందాలు అత్యంత నైపుణ్యంతో గుర్తించి, సురక్షితంగా నిర్వీర్యం చేయడంపై ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. అత్యవసర పరిస్థితుల్లో భద్రతా వ్యవస్థలు ఎంత వేగంగా స్పందిస్తాయో ఈ కార్యక్రమం ద్వారా పరీక్షించామని అధికారులు తెలిపారు. పరిశ్రమల భద్రత, ప్రజల ప్రాణరక్షణే లక్ష్యంగా ఈ తరహా మాక్ డ్రిల్లులు నిర్వహిస్తున్నామని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పోలీసు అధికారులు స్పష్టం చేశారు. పరిశ్రమల ప్రాంతాల్లో ప్రజలు భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, పోలీసులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉన్నారని భరోసా ఇచ్చారు.

డివిఎంసి సభ్యునిగా ములకలపల్లి రాజు

కలెక్టర్‌ను అభినందిస్తున్న రాజు

ప్రజాశక్తి -పరవాడ: అనకాపల్లి జిల్లా ఎస్‌సి, ఎస్‌టి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (డివిఎంసి) సభ్యునిగా పరవాడ మండలం ఈ బోనంగి ఫార్మాసిటీ కాలనీకి చెందిన ములకలపల్లి రాజు నియమితు లయ్యారు. ఈ మేరకు బుధవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఎస్‌సి,ఎస్‌టి వర్గాలపై జరుగుతున్న అన్యాయాలను అడ్డుకోవడం, వారి హక్కుల పరిరక్షణ, సంక్షేమ పథకాలు సక్రమంగా అమలయ్యేలా పర్యవేక్షించడం డివిఎంసి ప్రధాన బాధ్యతగా ఉంటుంది. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పనిచేసే ఈ కమిటీలో ఎస్‌సి, ఎస్‌టి వర్గాలకు చెందిన ఐదుగురు సభ్యులు, మూడు ఎన్‌జిఒ ప్రతినిధులతో కలిపి మొత్తం ఎనిమిది మంది సభ్యులు ఉంటారు. డివిఎంసి సభ్యునిగా ములకలపల్లి రాజు నియామకంపై పలువురు ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. తన నియామకానికి సహకరించిన పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, జనసేన మండల ఇన్‌ఛార్జి పంచకర్ల ప్రసాద్, ఉమ్మడి రూరల్ విశాఖ జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి బుగిడి రామగోవిందరావులకు రాజు కృతజ్ఞతలు తెలిపారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన

శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని గరిసింగి పంచాయతి శివారు చింతలపాలెం గ్రామంలో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి బుధవారం శంకుస్థాపన చేశారు. జల జీవన్ మిషన్ ద్వారా రూ.25 లక్షల నిధులతో ఈ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తయితే పరిసర గ్రామాలైన చింతలపాలెం సహా నాలుగు గ్రామాల ప్రజలకు సురక్షితమైన మంచినీరు అందుబాటులోకి రానుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముందుగా తెనుగుపూడి గ్రామంలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు స్వయంగా పెన్షన్లు అందజేశారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పి.వి.జి. కుమార్, రైవాడ జలాశయ చైర్మన్ పోతల పాత్రు నాయుడు, మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు పెద్దాడ వెంకటరమణ, దొగ్గ దేముడునాయుడు, జనసేన మండల అధ్యక్షుడు గొర్లెపోటు రామూర్తి నాయుడు, బీజేపీ మండల పార్టీ అధ్యక్షురాలు అవుగడ్డ సత్యవేణి (నాయుడమ్మ), అవుగడ్డ రామూర్తి నాయుడు, శరకాన సూర్యనారాయణ, పెంటకోట అప్పలనాయుడు, కోమార బాబురావు, గట్రెడ్డి కొండలరావు (జికె), ఎంపిడిఒ ఎం.వి.సువర్ణ రాజు, ఆర్డబ్ల్యూఎస్ చంద్రశేఖర్, ఇంచార్జ్ హౌసింగ్ ఎఇఇ తేజ, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి యస్ రాయవరం : మండలంలోని గుర్రాజుపేట, పెద గుమ్ములూరు,చిన గుమ్ములూరు గ్రామ పంచాయతీలలో జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను డిప్యూటీ ఎంపిడిఒ బంగారు సత్యనారాయణ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 5 వరకురు నిర్వహించే ప్రత్యేక పారిశుధ్య పనుల్లో భాగంగా అన్ని గ్రామాల్లోనూ చెత్త కుప్పలను తొలగించి పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. 5న ప్రత్యేక గ్రామ సభలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌కు ముందు, తర్వాత గ్రామాల్లో పారిశుధ్యానికి సంబంధించిన ఫోటోల ప్రదర్శన నిర్వహించాలన్నారు.

పొగ మంచుతో పరేషాన్!

ప్రజాశక్తి - కశింకోట : మండలంలో తాళ్ళపాలెం పరిసరాల ప్రాంతంలో బుధవారం తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కురవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తాళ్లపాలెం, నర్సీపట్నం రోడ్డులో ఉదయం 8 గంటల వరకు పొగమంచు విపరీతంగా కురవడంతో రోడ్డు కానరాని పరిస్థితుల్లో హెడ్‌లైట్ల వెలుగులో వాహనదారులు ప్రయాణం సాగించారు.

నర్సీపట్నం రోడ్డులో దట్టంగా కురుస్తున్నపొగ మంచు

వెలమలను 'బిసి ఎ'లో చేర్చేందుకు కృషి

ప్రజాశక్తి- దేవరాపల్లి : రాష్ట్రంలోని కొప్పుల వెలమ సామాజిక వర్గాన్ని 'బిసి డి' నుంచి 'బిసి ఎ' జాబితాలోకి మార్చాలని ప్రభుత్వానికి విన్నవించినట్లు రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి కుమార్ తెలిపారు. బుధవారం దేవరాపల్లి మండలం గరిసింగిలో విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 25 లక్షల జనాభా కలిగిన కొప్పుల వెలమలు 55 నియోజకవర్గాల్లో రాజకీయ గెలుపోటములను ప్రభావితం చేసే స్థాయిలో ఉన్నారన్నారు. వెనుకబడిన ఈ వర్గాల ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు కేటగిరీ మార్పు ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బిసిల సంక్షేమానికి కట్టుబడి ఉన్నారని, ఏడాదికి సుమారు రూ. 48 వేల కోట్లు నిధులు వెచ్చిస్తున్నారన్నారు.కార్పొరేషన్ల ద్వారా నిధులు కేటాయించి, అర్హులైన బిసివిద్యార్థులకు విదేశీ విద్య, నిరుద్యోగులకు రుణాలు, వృత్తిదారులకు ఆదరణ పథకం ద్వారా పనిముట్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రతి జిల్లా కేంద్రంలో తమ సామాజిక వర్గం కోసం కమ్యూనిటీ హాళ్ళు నిర్మించాలని కోరినట్లు వెల్లడించారు.

ఆటల పోటీల్లో 'ఆర్యభట్ట' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- సబ్బవరం :విశాఖపట్నం జిల్లా స్థాయి పాలిటెక్నిక్ కళాశాలలు గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ లో స్థానిక సబ్బవరం ఆర్యభట్ట పాలిటెక్నిక్ విద్యార్థులు పలు క్రీడ పోటీల్లో ప్రతిభను కనబరిచినట్లు ప్రిన్సిపాల్ ఎన్. సుధీర్ బాబు తెలిపారు. జిల్లా స్థాయి వాలీబాల్ బాయ్స్ విభాగంలో ప్రథమ స్థానం సాధించారు, గర్ల్స్ విభాగంలో ద్వితీయ స్థానం, ఖోఖో, బ్యాడ్మింటన్‌లో తృతీయస్థానంలోనూ, వంద మీటరల పరుగు పందెంలో రెండోస్థానంలో నిలిచారని తెలిపారు. ఆటల పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల చైర్మన్ సిహెచ్.మహంధాత నాయుడు అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ నరేష్, పీడీ ప్రవీణ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అడ్డురోడ్డులో నూతన సంవత్సర జోష్

పూలబొకేల దుకాణం వద్ద సందడి

ప్రజాశక్తి- ఎస్.రాయవరం : మండలంలో ప్రముఖ వ్యాపార కేంద్రమైన అడ్డరోడ్డు నూతన సంవత్సర వేడుకలకు సర్వం సిద్ధమైంది. బుధవారం సాయంత్రం నుండి నూతన సంవత్సర వేడుకలు చేసుకునేందుకు యువత ఉద్యోగస్తులు వివిధ వర్గాల ప్రజలు అడ్డరోడ్డు కూడలికి రావడంతో జంక్షన్ కిక్కిరిసిపోయింది. కేకు దుకాణాలు, పువ్వుల షాపులు, మిఠాయి దుకాణాలు, బిర్యానీ షాపులు కస్టమర్లతో కిటకిటలాడాయి. అడ్డరోడ్డు జంక్షన్ కొత్తగా రెవెన్యూ డివిజన్‌గా ఆవిర్భవించడంతో కొత్త శోభ సంతరించుకుంది

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి దాడి వీరునాయుడు కళాశాలలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు ముఖ్యఅతిథిగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ విచ్చేసి నూతన సంవత్సర కేక్ ను కట్ చేసి అందరికి శుభాకాంక్షలు తెలిపాసేజ అనంతరం కళాశాల వార్షిక ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థుల తల్లిదండ్రులను నగదు బహుమతి, సాలువ, జ్ఞాపికతో సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్ మాట్లా డుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ తల్లి దండ్రులకు, ఉపాధ్యాయులకు పేరు తీసుకురావాలన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్ దయామాధురి, పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ వితరణ

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని బయ్యవరం గ్రామంలో సన్ని యూత్ క్లబ్ సేవా కార్యక్రమాలలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి పెంచేందుకు రూ.10 వేల విలువైన స్పోర్ట్స్ డ్రెస్‌లను పంపిణీ చేశారు. సన్నియూత్ క్లబ్ అధ్యక్షుడు మామిడి నాయుడు,మాజీ అధ్యక్షులు గొన్నా ఆదిరాజు, జాయింట్ సెక్రటరీ తట్టాభాను, హెచ్ఎం జి.వి.రమణ, పిఇటి జి.కృష్ణమూర్తి, హైస్కూల్ కమిటీ చైర్మన్ ఆరిపాక వీరబ్రహ్మం పాల్గొన్నారు.

కోతులు, కుక్కల స్వైర విహారం

-భయబ్రాంతులకు గురవుతున్న ప్రజలు

ప్రజాశక్తి - రావికమతం: మండలంలో కోతులు, కుక్కలు స్వైర వీర విహారం చేస్తూ ప్రజలపై దాడి చేస్తున్నాయి. కోతులు పంట పొలాలను సర్వం నాశనం చేస్తున్నాయి. దీంతో, రైతులు పంటలను నష్ట పోతున్నారు.
మండలంలో బుడ్డిబంద ఆర్ అండ్ బి రోడ్డు సమీపంలోని పొలంలో వందలాది కోతులు ఉన్నాయి. ఆ రోడ్డు గుండా ప్రయాణం చేసే పాదచారులు, బైకిస్టులను భయబ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఎప్పుడు ఏ సమయంలో తమపై దాడి చేస్తాయోనని భయపడుతున్నారు. ఇటీవల రావికమతం బీసీ, ఎస్సీ, హాస్టల్ విద్యార్థులను, పొన్నవోలు, మేడివాడ, రావికమతం, చీమలపాడు గ్రామాలలో పలువురుపై కోతులు, కుక్కలు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈనెలలో రావికమతం జడ్పీ హైస్కూల్ విద్యార్థులను కోతులు గాయపరిచాయి. ఒక్క పక్కన గ్రామాలలో ఊర కుక్కలు సైతం గుంపులు గుంపులుగా ప్రజలపై, పసి పిల్లలపై దాడులు చేస్తున్నాయి. మరో పక్క కోతులు పంట పొలాలను సర్వనాశనం చేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు వీటి నియంత్రణకు చర్యలు చేపట్టక పోవవడం విశేషం. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి వీధి కుక్కలను, కోతులను నియంత్రించాలని పలువురు డిమాండ్ చేశారు.

అవగాహన కల్పిస్తున్న ఎఒ ఉమా ప్రసాద్

అపరాల సాగులో యాజమాన్య చర్యలు పాటించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:అపరాల సాగులో సమగ్ర పంట యాజమాన్యం పాటించాలని వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ రైతులకు సూచించారు. మండలంలో కాగిత, గునుపూడి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ సిబ్బందితో కలిసి అపరాలు సాగు పంట పొలాలను పరిశీలించారు. అపరాల సాగుపై పంట యాజమాన్యం, సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. మండలంలో సుమారుగా 925 ఎకరాల్లో అపరాలు సాగు అవుతుందని తెలిపారు. రైతుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ వేదిక సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ సమాచారాన్ని, సేవలను అందిస్తుందన్నారు. పంటల సలహాలు, తెగుళ్ల హెచ్చరికలు, సబ్సిడీలు, విత్తనాల పంపిణీ వంటివి మొబైల్ యాప్ ద్వారా రైతులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఏఈఓ సత్యనారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు ధనరాజు, రజిత రైతులు పాల్గొన్నారు.

ఊరేగిస్తున్న అర్చకులు

వెంకన్న తిరువీధి సేవ

ప్రజాశక్తి -నక్కపల్లి: ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీనివాసుడు గరుడ వాహనంపై పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మాడవీధుల్లో అర్చక బృందం ఆధ్వర్యంలో తిరువీధి సేవ నిర్వహించారు. స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యులు, అర్చకులు పీసపాటి శేషాచార్యులు, గోపాలాచార్యులు, పవన్, ఆలయ ఇన్ స్పెక్టర్ కూర్మేశ్వరరావు పాల్గొన్నారు.

అప్పలరాజును తక్షణమే విడుదల చేయాలి

-మత్స్యకారుల నిరసన

ప్రజాశక్తి -నక్కపల్లి:సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు పై పీడీ యాక్ట్ పెట్టి, అన్యాయంగా అరెస్టు చేయడం సరికాదని సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు మైలపల్లి మహేష్ బాబు అన్నారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో అప్పలరాజు అరెస్టును ఖండిస్తూ బుధవారం 9వ రోజు మత్స్యకారులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మహేష్‌బాబు మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై నిరంతరం అలు పెరగని పోరాటం చేస్తున్న ప్రజా నాయకుడిపై పీడీ యాక్ట్ పెట్టి నిర్బంధించడం పచ్చి దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోడా కాశీరావు, వై.చిట్టియ్య, పి.కన్నయ్యమ్మ, బి.నూకలమ్మ, బి.పార్వతి, వై.జగమని, డి.నూకమ్మ వై.కోర్లయమ్మ.పి.కాంతం, అమ్మాజీ, తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

పనులు పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులను బుధవారం తెలుగుదేశం పార్టీ నాయకులు పరిశీలించారు. హెటిరో కంపెనీ సి ఎస్ ఆర్ నిధుల నుండి ఆధునికంగా పోలీస్ స్టేషన్ భవన నిర్మాణం చేపడుతున్నారు. ఈ మేరకు భవన నిర్మాణ పనులను నాయకులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఎస్ఐ సన్నిబాబుతో భవన నిర్మాణ పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, పార్టీ మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి, శ్రీనివాసరావు, నాయకులు జగదీశ్వరరావు, వీరబాబు, మెరుగు నాగేశ్వరరావు, క్రి వెంకట సత్యనారాయణ, తాతారావు, సురేష్, అప్పలరాజు, గణేష్, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

టమాటా ధరలకు రెక్కలు

ప్రజాశక్తి -గొలుగొండ:ప్రస్తుతం టమాటా ధర పైపైకి పోతుంది. నెల రోజుల క్రితం 30 కేజీల క్రేటు టమాట 300 నుంచి 400 ధర ఉండేది. ప్రస్తుతం వెయ్యి రూపాయలు ధర పలుకుతుంది. ప్రతి ఏటా ఈ సీజన్లో బెంగళూరు, మదనపల్లి నుండి టమాటా దిగుమతులు జరిగి మార్కెట్లోకి వచ్చేది. ఇటీవల తుఫాన్ కారణంగా ఆయా ప్రాంతాల్లో టమాటా పంట దెబ్బతినడంతో మన ప్రాంతానికి టమాటా దిగుమతి నిలిచిపోయింది. స్థానిక రైతులంతా డిసెంబర్, జనవరి నెలలో దిగుబడి వచ్చే విధంగా టమాట పండించారు. దీంతో మన ప్రాంతంలో కొద్దిమంది పండించిన టమాటానే మార్కెట్లోకి కనిపిస్తుంది. ఈ సీజన్లో దిగుమతి కావాల్సిన టమాటా అందుబాటులోకి లేకపోవడం, టమాటా వినియోగం ఎక్కువగా కావడం తో మార్కెట్లో టమాట ధర విపరీతంగా పెరిగింది.

2 నుంచి పాస్ పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి -మాడుగుల:మండలంలోని పొంగలిపాక గ్రామంలో ఈనెల 2న రాజముద్రతో ఉన్న పాస్ పుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతుందని కూటమి నాయకులు, కింతలి పిఎసిఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఉండూరు దేముడు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు హాజరు కానున్నారన్నారు. కూటమి నాయకులు ప్రతి ఒక్కరు హాజరు కావాలని కోరారు.

రావికమతం: ఈనెల 2 నుంచి రావికమతం సచివాలయం వద్ద ప్రభుత్వ రాజముద్రతో ముద్రించిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తామని బుధవారం తహసిల్దార్ అంబేద్కర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నూతనంగా పంపిణీ చేస్తున్న పాసుపుస్తకాలు తీసుకోవాలని కోరారు. విస్తీర్ణం, సర్వే నెంబర్లు, ఎల్ పి ఎం నెంబర్లు అన్ని గతంలో ఏవైతే ఉన్నాయో అవి మాత్రమే ఉంటాయని తెలిపారు.

బుచ్చయ్యపేట : ఈనెల 2 నుండి 9 వరకు రీసర్వే పూర్తయిన గ్రామాల్లో మండలంలోని 14 గ్రామాలలో రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు తహశీల్దార్ ఎం లక్ష్మి బుధవారం తెలిపారు. 2న శుక్రవారం మండలంలో దిబ్బిడి, చిన్నప్పన్న పాలెం గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు నిర్వహించి పట్టాదారు పాసు పుస్తకాలను రైతులకు అందజేస్తామన్నారు.

అనకాపల్లి రూరల్ : రీ సర్వే పూర్తయిన 17 గ్రామాలకు 10,815మంది రైతులకు కొత్తపట్టాదారు పాసుపుస్తకాలను ఈనెల 2 నుంచి పంపిణీ చేయనున్నట్లు తహసిల్దార్ జి. ఆనందరావు తెలిపారు. గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు నిర్వహించి అందజేస్తామన్నారు.2న ఉదయం మారేడు పూడి, అగ్రహారం, గోపాలపురం మధ్యాహ్నం సిహెచ్ ఎన్ అగ్రహారం, గొలగాం, 3న ఉదయం శంకరం, మార్టూరు, మధ్యాహ్నం మాకవరం, బట్లపూడి 5న ఉదయం పిఎస్ పాలెం, అల్లికానుడి పాలెం, మధ్యాహ్నం ఊడేరు, 6న ఉదయం బవులువాడ, మధ్యాహ్నం సీతానగరం, 7న ఉదయం మెట్టపాలెంలో, మధ్యాహ్నం జగన్నాధపురం, 8న కూండ్రం, మధ్యాహ్నం కుంచంగి, 9న ఉదయం విజె. పాలెంలో, మధ్యాహ్నం పిసినికాడలో గ్రామ రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు.

పాఠశాలకు కుట్టు మిషన్ వితరణ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట:మండలంలో గున్నెంపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కుట్టు మిషన్ అందజేశారు. ఈ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్)గా పని చేస్తున్న బి.ఎన్. మూర్తి కుట్టు మిషన్‌ను పాఠశాల కు బుధవారం అందించారు. ఈ కుట్టు శిక్షణను పాఠశాల క్రాఫ్ట్ ఫ్యాకల్టీ ఎస్. మహేష్ ఇవ్వనున్నారు.విద్యార్థుల్లో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ రంగాలపై ఆసక్తి పెంపొందించేందుకు జనవరి 1వ తేదీ నుండి వర్క్‌షాపులు నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.వి.ఎస్.ఎస్. శాస్త్రి తెలిపారు. పాఠశాల కమిటీ చైర్మన్ మడక సత్తిబాబు, పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

కుట్టుమిషన్‌ను ఇస్తున్న మూర్తి

బహుమతులు అందజేస్తున్న ఎస్సై

విద్యార్థులకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-రోలుగుంట: రోలుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గంజాయి, మాదక ద్రవ్యాల నివారణలో విద్యార్థుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు రోలుగుంట ఎస్సై జి.రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం బహుమతులు అందజేశారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులే భవిష్యత్ భావిభారత పౌరులు అని మాదక ద్రవ్యాల జోలికి వెళ్లరాదన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టివి.శేషగిరిరావు, అధ్యాపకులు విజయరాణి, సిబ్బంది పాల్గొన్నారు.

4న సిఐటియు బహిరంగ సభకు తరలిరండి

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : సిఐటియు అఖిలభారత మహాసభ సందర్భంగా ఈనెల 4న విశాఖలో నిర్వహించే కార్మిక మహాప్రదర్శన, బహిరంగ సభకు వేలాదిగా తరలిరావాలని కోరుతూ బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో ఎస్ఇజెడ్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ రాము మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభలో చర్చించి, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తారన్నారు.



విశాఖలో ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి టౌన్ కొత్తరోడ్డులోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో బహిరంగ సభ వేదిక వరకు నిర్వహించే కార్మిక ప్రదర్శనతోపాటు బహిరంగ సభకుకార్మికులు, ఉద్యోగులు, యువకులు, విద్యార్థులు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎల్ తాతారావు, రామారావు, నర్సింగరావు, సత్తిబాబు పాల్గొన్నారు.

సెజ్‌లో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నేతలు

రావికమతం:సిఐటియు ఆల్ ఇండియా 18వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు వజ్రపు సత్యవతి కోరారు. మండల కేంద్రంలో బుధవారం కార్మికులతో సమావేశ అయ్యారు. ప్రతి ఒక్కరు మహాసభలకు హాజరు కావాలని సంసిద్ధత చేశారు. ఈనెల 4న విశాఖ కేంద్రంలో నిర్వహించే సిఐటియు మహాసభకు కార్మికులు, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కులను, చట్టాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాల రాస్తున్నాయన్నారు. అక్రమ అరెస్టులు చేయడం దురదదృకరమన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకు వచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్, ప్రైవేటీకరణ విధానాలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక తయారు చేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. ప్రభుత్వం వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ మహాసభలో చర్చించి ప్రభుత్వాన్ని ఎండగడతామన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పలువురు పాల్గొన్నారు.

రావికమతంలో ప్రచారం చేస్తున్న నాయకులు

విశాఖ కలెక్టరేట్ : సిఐటియు అఖిలభారత మహాసభలు ముగింపు సందర్భంగా జనవరి 4న ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు డాబా గార్డెన్స్ అంబేద్కర్ విగ్రహం, ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం వరకు భారీ ర్యాలీ, బహిరంగ సభకు మున్సిపల్ వర్కర్లు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) అధ్యక్షులు ఉరుకూటి రాజు పిలుపునిచ్చారు. సిఐటియు 18వ అఖిల భారత మహాసభల ప్రారంభకు బుధవారం హాజరైన మున్సిపల్ వర్కర్లతో ఆయన మాట్లాడారు. సమావేశంలో యూనియన్ నాయకులు గొలగాని అప్పారావు, నక్క నాగరాజు, జెఆర్.నాయుడు పాల్గొన్నారు.

వార్తా రచనలో ప్రజాశక్తిది ప్రత్యేక స్థానం

కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి -చోడవరం : వార్తా రచనలో ప్రజాశక్తికి ప్రత్యేక స్థానం ఉందని స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ప్రజాశక్తి 2026 నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా ప్రజా సమస్యలను ఎత్తిచూపుతూ, వాటి పరిష్కారానికి మార్గంచూపే పత్రిక ప్రజాశక్తి అన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ దేవరపల్లి వెంకట అప్పారావు, టిడిపి యువ నాయకులు సకురు కోటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు ఎర్రంశెట్టి చిన్న, పప్పు శ్రీను, గుమ్మల సత్తిబాబు, ప్రజాశక్తి డివో గణేష్, విలేకరి కోవెల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అడ్డురోడ్డు జంక్షన్ రెవెన్యూ డివిజన్ కేంద్రం ప్రారంభం

డివిజన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి -యస్ రాయవరం : వ్యాపార కేంద్రమైన అడ్డరోడ్డులో రెవెన్యూ డివిజనల్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ బుధవారం ప్రారంభించారు. అడ్డరోడ్డులో తిమ్మాపురం సచివాలయం భవనంలో తాత్కాలికంగా రెవిన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొణతాల మాట్లాడుతూ అడ్డురోడ్డులో రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటులో హోంశాఖ మంత్రి అనిత కృషి ఎంతో ఉందన్నారు. అనిత నేతృత్వంలో పాయకరావుపేట నియోజకవర్గం అభివృద్ధిలో శరవేగంగా దూసుకు పోతోందన్నారు. నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చెందితే లక్షల్లో ఉద్యోగాలు వస్తాయన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై సిఎంచంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఇద్దరూ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. గడచిన ఐదేళ్లలో అభివృద్ధిలో అస్తవ్యస్తంగా మారిన రాష్ట్రాన్ని కూటమి పాలనలో గాడీలో పెట్టేందుకు కృషి చేస్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు మేజర్ల వినోద్ రాజు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు అమలకంటే అబద్ధం, పాయకరావుపేట నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, పిఎసిఎస్ అధ్యక్షులు గుర్రం రామకృష్ణ పిఎసిఎస్ డైరెక్టర్ కోన అప్పలరాజు, నాలుగు మండలాల నాయకులు అధికారులు పాల్గొన్నారు

3న కశింకోట మండల సమావేశం

ప్రజాశక్తి- కశింకోట : ఈనెల 3న శనివారం ఉదయం 10గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ చంద్రశేఖరరావు తెలిపారు. ఎంపిపి కలగా లక్ష్మి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని సూచించారు. ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, ఇతం ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

యుటిఎఫ్ కేలండర్, డైరీ ఆవిష్కరణ

యుటిఎఫ్ డైరీ, కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎంపిడిఒ, ఎంఇఒ

ప్రజాశక్తి- కె.కోటపాడు : యుటిఎఫ్ ముద్రించిన కేలండర్, అధ్యాపక దర్శిని, డైరీలను బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఎ.ఎ.సాంబశివరావు, ఎంఇఒ2 కూనిరెడ్డి సత్యనారాయణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి ఎస్.అప్పలరాజు, యూటిఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు, మండలశాఖ అధ్యక్షురాలు రొంగలి ఉమాదేవి, మండల ప్రధాన కార్యదర్శి ఇమంది అశోక్ కుమార్, జిల్లా కౌన్సిలర్ పిల్లల రమేష్, కార్యదర్శి రొణసింగి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.